


శివలింగాలతో మహా గణపతి



గాజువాక ఆర్టీసీ డిపో సమీపాన శివలింగాలతో ఏర్పాటుచేసిన 108 అడుగుల వినాయక విగ్రహం

నేడు ముఖ్యమంత్రి రాక

- ఇండియా ఫుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ సదస్సుకు హాజరు
- అనంతరం డబుల్ డెక్కర్ బస్సుల ప్రారంభం



విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం నగరానికి రానున్నారు. తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 11.15 గంటలకు బీచ్‌రోడ్డులోని కోస్టల్ బ్యాటరీకి చేరుకుంటారు. నేరుగా నోవాటెల్ హోటల్‌కు వెళతారు. అక్కడ జరిగే ఇండియా ఫుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ సదస్సులో పాల్గొంటారు. అనంతరం 12.55 గంటలకు బయలుదేరి బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం వద్దకు చేరుకుంటారు. ఏపీ టూరిజం ఏర్పాటుచేసిన డబుల్ డెక్కర్ (హాప్ ఆన్-హాప్ ఆఫ్) బస్సులను ప్రారంభిస్తారు. 1.10 గంటలకు బయలుదేరి రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళతారు. మధ్యాహ్నం భోజనం తర్వాత రెండు గంటలు నుంచి 3.45 వరకు గ్రిఫిన్ ఫౌండర్ నెట్‌వర్క్ మీటింగ్‌లో పాల్గొంటారు. 3.50కు బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుని విమానంలో బెంగళూరు వెళతారు.

నగరానికి చేరుకున్న లోకేశ్

పార్టీ కార్యాలయంలో అర్జీల స్వీకరణ

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ మూడు రోజుల పర్యటన కోసం గురువారం సాయంత్రం నగరానికి చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో ఆయనకు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ నుంచి పార్టీ కార్యాలయానికి చేరుకున్న ఆయన...వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యకర్తలతో ఫొటోలు దిగారు. పార్టీ కార్యాలయ ఆవరణలో నిలిపివుంచిన బస్సులో బస చేసిన లోకేశ్‌ను ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవరావు, పార్లమెంటరీ పార్టీ

... మిగతా 6వ పేజీలో



విమానాశ్రయంలో మంత్రి నారా లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

భావి ఉపాధ్యాయుల ఆనందహేల

డీఎస్సీ మెరిట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం

విశాఖ విమల విద్యాలయంలో ప్రక్రియ

- పర్యవేక్షించిన జిల్లా పరిశీలకుడు, డీఈవో
- ఇబ్బందుల పరిష్కారానికి తాత్కాలిక కౌంటర్

విశాఖపట్నం/ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో మెరిట్ ప్రకారం కాల్ లెటర్లు అందుకున్న భావి ఉపాధ్యాయుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. సుమారు ఏడేళ్ల తరువాత నిర్వహించిన డీఎస్సీలో ప్రతిభ కనబరచిన అభ్యర్థుల ధ్రువపత్రాలను గురువారం నుంచి విశాఖ విమల విద్యాలయంలో పరిశీలించనున్నట్టు పాఠశాల విద్యా శాఖ ప్రకటించింది. ఈ మేరకు కుటుంబ సభ్యులతో కలిసి అభ్యర్థులు ఉదయం ఎనిమిది గంటలకే విద్యాలయ ప్రాంగణానికి చేరుకున్నారు. తొలిరోజు గదికి 50 మంది వంతున అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాట్లు చేశారు. ఒక్కొక్క గదిలో అన్ని కేటగిరీలకు చెందిన అభ్యర్థులను కేటాయించారు.

గతంలో కేటగిరీ, ర్యాంకుల వారీగా ధ్రువపత్రాల పరిశీలన ఉండేది. కాగా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు సంబంధించి ఇబ్బందులు ఉన్నా, ఇతరత్రా సందేహాలున్నా నివృత్తి చేసేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మధుసూదనరావు నేతృత్వంలో రెవెన్యూ అధికారుల బృందం విమల విద్యాలయంలో ... మిగతా 6వ పేజీలో



స్టీల్‌ప్లాంట్ వద్ద విశాఖ విమల విద్యాలయంలో డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

శ్రమించారు, సాధించారు

తండ్రి లక్ష్యం కోసం ఒకరు...

- అవమానాలను తట్టుకుని మరొకరు
- ఎస్జీటీలో జిల్లా ప్రథమ, ద్వితీయ ర్యాంకర్ల విజయగాథ



గనివాడ సుజాత, ఎస్జీటీ ప్రథమ ర్యాంకు



తాటికొండ ధనలక్ష్మి, ఎస్‌జీటీ రెండో ర్యాంకు

ఉమ్మడి జిల్లాలో ఎస్జీటీ పోస్టులకు 14,500 మంది పోటీ పడితే వారిలో 92.9 మార్కులతో గనివాడ సుజాత ప్రథమ ర్యాంకు, 92.58 మార్కులతో తాటికొండ ధనలక్ష్మి రెండో ర్యాంకు సాధించారు. ఇరువురూ అనేక సవాళ్లను ఎదుర్కొని ఉపాధ్యాయ ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకుని

... మిగతా 6వ పేజీలో

జనసేనకు యువతే ప్రాణం





జనసేనకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశమైన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్

రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే అలయన్స్ అవసరం...ప్రజలు కూడా అదే కోరుకుంటున్నారు

- పొత్తులో ఉన్నా పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టి పనిచేయాలి
- నాయకులకు జనసేన అధినేత కె.పవన్‌కల్యాణ్ దిశానిర్దేశం

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు జనసేనదేనని, పార్టీకి యువతే ప్రాణమని, వారిని నాయకులు కలుపుకొని వెళ్లాలని అధినేత పవన్ కల్యాణ్ లెజిస్లేటివ్ మీటింగ్‌లో సూచించారు. బీచ్‌రోడ్డులోని బీచ్ వ్యూ హోటల్‌లో ఆయన గురువారం పార్టీకి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ తన గొంతులో ప్రాణం ఉన్నంత వరకూ జనసేన పార్టీని ముందుకు నడిపిస్తానని స్పష్టంచేశారు. పార్టీని తాను నడపలేనని కొందరు రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానాలు చేశారని, ఇప్పుడు వారే పార్టీ సాధించిన విజయాలు చూసి అభిప్రాయాలు మార్చుకుంటున్నారన్నారు. మూడు పార్టీలు కలసి పనిచేసినప్పుడు కొన్ని ఇబ్బందులు వస్తాయని, వాటిని సమయానుకూలంగా అధిగమించాలని సూచించారు. ఈ రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే అలయన్స్ అవసరమని, ప్రజలు కూడా అదే కోరుకుంటున్నారు కాబట్టి ... మిగతా 6వ పేజీలో

బ్యాంకాక్, మలేషియా, కొలంబో

విమానాలు పునరుద్ధరించండి

- అంతర్జాతీయ విమాన సర్వీసులపైనా దృష్టి పెట్టండి
- ఎయిర్‌పోర్టు అధికారులకు విమానాశ్రయం సలహా కమిటీ అధ్యక్షులు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ సూచన
- బ్యాగేజీ స్కానర్లు తరచూ మొరాయింపుపై అసంతృప్తి
- ఇంటర్నేషనల్ కార్గో చేయలేమని చేతులెత్తేసిన సంస్థ



విమానాశ్రయంలో సూచనలు చేస్తున్న సలహా కమిటీ అధ్యక్షులు ఎంపీ శ్రీభరత్. పక్కన ఇన్‌ఛార్జి డైరెక్టర్ పురుషోత్తం

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విమానాశ్రయంలో ఇన్‌లైన్ బ్యాగేజీ చెకింగ్ ఆరు నెలలైనా ప్రారంభం కాకపోవడం, లగేజీని చెక్ చేసే స్కానర్లలో రెండూ తరచూ మొరాయించడం, ఇంకా మౌలిక వసతుల లోపాలపై విమానాశ్రయం సలహా కమిటీ అధ్యక్షులు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇన్‌చార్జి డైరెక్టర్ పురుషోత్తం, ప్రభుత్వ విప్ గణబాబు, నేవీ అధికారులు, సలహా కమిటీ సభ్యులతో ఆయన విమానాశ్రయంలో గురువారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏడాది నుంచి అంతర్జాతీయ కార్గో ప్రారంభించాలని సూచిస్తున్నా, ఎందుకు చేయడం లేదని ఎంపీ ప్రశ్నించారు. ఇక్కడి నుంచి వెళ్లే సరకును అంచనా వేయగా అంత పొటెన్షియాలిటీ లేదని తేలిందని ఏజెన్సీ ప్రతినిధి ... మిగతా 6వ పేజీలో

భయం గుప్పిట...

కొండవాలు నివాసితుల్లో ఆందోళన

- మూడు రోజులుగా వర్షాలు
- నానిపోయి జారి పడుతున్న మట్టి పెళ్లలు, రాళ్లు
- నగర పరిధిలోని ఐదు ప్రాంతాలకు పొంచి ఉన్న ముప్పు
- ప్రమాదంలో 249 కుటుంబాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) నగరంలో కురుస్తున్న వర్షాలు కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న వారి కంటికి నిద్రను దూరం చేస్తున్నాయి. భారీ వర్షాలకు రాళ్లు, మట్టి జారిపోతాయనే ఆందోళన వారిని తీవ్రంగా కలవరపరుస్తోంది. గత ఏడాది గోపాలపట్నం వద్ద కొండచరియలు జారి ఐదు ఇళ్లకు ప్రమాదం వాటిల్లింది. తాజాగా



నగరంలోని కొండవాలు ప్రాంతంలో ప్రమాదకరంగా ఇళ్లు

గత ఏడాది కొండవాలు ప్రాంతాలపై జీవీఎంసీ అధికారులు చేపట్టిన సర్వే వివరాలు

మొత్తం కాలనీలు	135
నివాసిత కుటుంబాలు	14,431
తీవ్రమైన ముప్పు పొంచివున్న ప్రాంతాలు	5
ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలు	249
మధ్యస్థ ముప్పు పొంచివున్న ప్రాంతాలు	89

కల్లుపాకలు ప్రాంతంలో వర్షాలకు నానిపోయిన పోలీస్‌బ్యారెక్స్ గోడ అర్ధరాత్రి సమయంలో కూలిపోయింది. మరో రెండురోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొనడంతో కొండవాలుప్రాంత నివాసితులతోపాటు పాత భవనాల్లో ఉంటున్న వారిలో గుబులు రేపుతోంది.

టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి కల్లుపాకలు వద్ద పోలీస్ బ్యారెక్స్ ప్రహరీ కూలిపోవడంతో నగరంలో పురాతన భవనాలు, కొండవాలు ప్రాంతాల్లోని నివాసాల భద్రత చర్చనీయాంశంగా మారింది. ఆరిలోవ, విశాలాక్షి నగర్, పెదగదిలి, చినగదిలి, మధురవాడ వికలాంగుల కాలనీ, రిక్షా కాలనీ, హెచ్‌బీ కాలనీ దుర్గానగర్, కప్పరాడ, కైలాసపురం, వెంకోజీపాలెం, మురళీనగర్, కప్పరాడ, ... మిగతా 6వ పేజీలో

సర్కారు బడుల్లో ఏఐ ల్యాబ్స్

- రూ.నాలుగు కోట్లతో జిల్లాలో 50 ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు
- మంత్రి నారా లోకేశ్ చొరవతో ముందుకొచ్చిన సైయంట్ సంస్థ

విశాఖపట్నం/కొమ్మాది, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యం (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)) అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఐటీ కంపెనీ సైయింట్ సంస్థ ముందుకువచ్చింది. సామాజిక బాధ్యత కింద జిల్లాలో తొలి దశలో ... మిగతా 6వ పేజీలో



చంద్రంపాలెం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏఐ ల్యాబ్

వినాయక విగ్రహం వద్ద అనధికార వసూళ్లు

- అడ్డుకున్న గాజువాక పోలీసులు

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గాజువాక లంకా మైదానంలో లక్ష చీరలతో ఏర్పాటుచేసిన గణపతి విగ్రహం వద్ద అనధికార వసూళ్లు యథావిధిగా జరుగుతున్నాయి. దేవుడి పేరిట వ్యాపారం చేయరాదని, ... మిగతా 6వ పేజీలో

ఉత్సవాలకు రూ.1.25 లక్షలు విరాళం

మధురవాడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన 55 వినాయక మండపాలకు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు దంపతులు రూ. 1.25 లక్షలు విరాళంగా అందించారు. గురు వారం ఆయా విగ్రహాలను సందర్శించిన వారు నిర్వాహకులకు విరాళాలు ఇచ్చారు.

ఉపాధ్యాయిని శ్రీదేవికి సత్కారం

భీమునిపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన తిరుమల శ్రీదేవిని టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ గురువారం ఘనంగా సత్కరించారు. ఆమె పండిట్ నెహ్రూ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్నారు.

శ్రమించారు, సాధించారు

... 5వ పేజీ తరువాయి

అనుకున్నది సాధించారు. చోడవరం మండలం రేవళ్ల గ్రామానికి చెందిన గనివాడ సత్యనారాయణకు ఇద్దరు కుమార్తెలు. ఉపాధ్యాయునిగా పనిచేయాలని సత్యనారాయణ ఆశపడినా కోర్కె నెరవేరలేదు. అయితే తాను చేయాలనుకున్న టీచర్ ఉద్యోగంలో తన ఇద్దరు కుమార్తెలను చూడాలనుకున్న సత్యనారాయణ అదే ఆశయంతో చదివించారు. పెద్దకుమార్తె ఉపాధ్యాయురాలిగా ఎంపికై ప్రస్తుతం పాడేరు సమీపాన ఒక స్కూలులో పనిచేస్తున్నారు. రెండో కుమార్తె సుజాత ఇటీవల నిర్వహించిన డీఎస్సీ (ఎస్జీటీ)లో ఏకంగా జిల్లాస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించి తండ్రి లక్ష్యాన్ని నేరవేర్చారు.

చెప్పలేనంత ఆనందంగా ఉంది

గనివాడ సుజాత, ఎస్జీటీ ప్రథమ ర్యాంకరు

ఎస్జీటీ కేటగిరీలో ప్రథమ ర్యాంకు వచ్చినందుకు చెప్పలేనంత ఆనందంగా ఉంది. తండ్రి ఆశయం కోసం కష్టపడి చదివాను. ఇప్పుడు ఆయన లక్ష్యం, ఆశయం నెరవేరడం సంతోషంగా ఉంది. డీఎస్సీ నిర్వహిస్తామన్న ప్రభుత్వం హామీ నిలబెట్టుకుంది. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే ఆశయంగా పనిచేస్తాను.

అవమానించిన చోట...

మాడుగుల మండలం జమ్మాదేవిపేటకు చెందిన తాటికొండ ధనలక్ష్మిది పేద కుటుంబం. భర్తకు అర ఎకరా పొలం మాత్రమే ఉంది. వారికి ఇద్దరు పిల్లలు. చదువు పట్ల ధనలక్ష్మిలో ఆసక్తిని గమనించిన భర్త అనేక కష్టాలకు ఓర్చి చదివించారు. ఇద్దరు పిల్లలు కలిగిన తరువాత చదువు ఎందుకు? అంటూ గ్రామంలో అనేకమంది హేళన చేశారు. అన్నింటినీ భరిస్తూ డీఎస్సీకి ప్రిపేరైన ధనలక్ష్మి ఎస్జీటీ కేటగిరీలో జిల్లాలో ఏకంగా రెండో ర్యాంకు సాధించారు. అవమానాలు ఎదుర్కొన్న చోటే..భర్తను తల ఎత్తుకునేలా చేశారు.

మా జీవితాల్లో వెలుగులు నింపింది

తాటికొండ ధనలక్ష్మి, ఎస్జీటీ రెండో ర్యాంకు

ఎస్జీటీ కేటగిరీలో రెండో ర్యాంకు సాధించడం ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం మా కుటుంబంలో వెలుగులు నింపింది. నాకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. చదువంటే చాలా ఇష్టం. నా ఇష్టాన్ని గుర్తించి నా భర్త చదివించారు. మా గ్రామంలో కొంతమంది నా భర్తను, నన్ను హేళన చేశారు. అయినా వెనకడుగువేయకుండా కష్టపడి చదివాను. విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలిగించేలా బోధన చేస్తాను.

భయం గుప్పిట...

... 5వ పేజీ తరువాయి

గోపాలపట్నం, పెందుర్తి, గాజువాక, మల్కాపురం తదితర ప్రాంతాల్లో కొండవాలులో వేలాది మంది నివాసాలు ఏర్పరుచుకుని జీవనం సాగిస్తున్నారు. భారీవర్షాలు కురిసిన ప్రతిసారీ ఎక్కడోఒకచోట కొండచరియలు విరిగిపడడం, మట్టిపెళ్లలు జారిపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సుమారు తొమ్మిదేళ్ల కిందట భారీవర్షం కారణంగా కైలాసపురంలో రాత్రివేళ కొండచరియ విరిగి దిగువనున్న ఇంటిపై పడడంతో ముగ్గురు మృతిచెందారు. వెంకోజీపాలెం మెడికవర్ ఆస్పత్రి వద్ద వర్షానికి ఎత్తున ఉన్న మట్టిజారి దిగువన ఉన్న పూరిళ్లపై పడడంతో ఒకరు మృతిచెందారు. గత ఏడాది గోపాలపట్నం లక్ష్మీనగర్ వద్ద కొండవాలులో మట్టిజారిపోవడంతో ఐదు ఇళ్లు ప్రమాదానికి గురయ్యాయి.

భారీ వర్షాలతో ఆందోళన


తాజాగా అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురిశాయి.మరో రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొండవాలు ప్రాంతాలన్నీ ఇప్పటికే నానిపోయి ఉండడంతో ఎలాంటి ఉపద్రవం ముంచుకొస్తుందోనని అధికారులతో పాటు కొండవాలు నివాసితులు ఆందోళన చెందుతున్నారు. కొండవాలు ప్రాంతాల్లో ప్రమాదాలను నియంత్రించేందుకు వీలుగా రక్షణ గోడల నిర్మాణం, ప్రమాదంలో ఉన్న భవనాలను తొలగించడానికి జీవీఎంసీ, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా గత ఏడాది సర్వే నిర్వహించారు.

కొండవాలులో 14,431 కుటుంబాలు

నగరంలోని పలుప్రాంతాల్లోని కొండవాలు ప్రాంతాల్లో నివాసాలు, ప్రమాదం ముంగిట ఉన్న ప్రాంతాలపై జీవీఎంసీ, రెవెన్యూశాఖ అధికారులు ఈనెల రెండున ఒక సర్వే నిర్వహించారు. కొండవాలులో 135 కాలనీలు ఉన్నాయని, అందులో 14,431 కుటుంబాలు నివసిస్తున్నట్టు గుర్తించారు. కొండవాలు ప్రాంతాల్లో అనకాపల్లి జోన్‌లోని ఇందిరమ్మకాలనీ, బీసీ కాలనీ-1, బీసీ కాలనీ-2, పాస్టర్ కాలనీతోపాటు జోన్-2 పరిధిలోని హనుమంతవాక కాలనీలు ప్రమాదం ముంగిట ఉన్నట్టు గుర్తించారు. ఈ ఐదు కాలనీల్లో 249 కుటుంబాలు నివసిస్తున్నాయని, వారిని ప్రత్యామ్నాయ ప్రాంతాలకు తరలించడం వల్ల భవిష్యత్తులో ప్రాణనష్టాన్ని నివారించవచ్చునని అభిప్రాయపడ్డారు. కొండవాలులో ఉన్న కాలనీల్లో మధ్యస్థ ప్రమాదం ముంగిట మరో 89 కాలనీలు ఉన్నట్టు గుర్తించారు.

పురాతన భవనాలపై చర్యలేవీ?

మరోవైపు నగరంలో పురాతన భవనాలను గుర్తించే పనిలో జీవీఎంసీ అధికారులు నిమగ్నమయ్యారు. జోన్లు వారీగా జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో వార్డు ప్లానింగ్ సెక్రటరీలతో పురాతన భవనాలను గుర్తించే ప్రక్రియ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నగరంలో 400 పురాతన భవనాలు ఉన్నాయని గుర్తించినట్టు తెలిసింది. ఎక్కువగా పాతనగరంలో 90 భవనాలు పురాతనమైనవిగా గుర్తించారు. భీమిలి జోన్‌లో 15, జోన్-2 పరిధిలో 50, జోన్-3 పరిధిలో 30, జోన్-5 పరిధిలో 50 వరకు గుర్తించారు. పురాతన భవనాలుగా నిర్ధారించాలంటే ఆంధ్ర విశ్వవిద్యాలయం స్ట్రక్చరల్ ఇంజనీర్లు భవనాన్ని సందర్శించి సిమెంట్, కాంక్రీట్, ఐరన్ పటిష్ఠత నిర్ధారించేందుకు శాంపిళ్లు తీసి, ల్యాబ్‌లో పరీక్షిస్తారు. ఇందుకు సుమారు రూ.లక్ష వరకు ఖర్చవగా, పురాతన భవనమని నిర్ధారణ అయితే దానిని కూల్చివేయడం, డెబ్రిస్‌ను తరలించడానికి మరో రూ.రెండు, మూడు లక్షల వరకు ఖర్చవుతుంది. దీంతో అంత మొత్తం ఖర్చు పెట్టలేక అధికారులు మొక్కుబడిగా నివాసితులకు నోటీసు ఇచ్చి వదిలేస్తున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పురాతనభవనాలపై శాశ్వత చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.




విశాలాక్షినగర్‌లో ఉత్తమ్ యూత్ ఏర్పాటు చేసిన వినాయకుడు



చంద్రంపాలెంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి



సాగర్‌నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిమ



భీమిలి గొల్లవీధిలో ప్రతిష్ఠించిన భారీ వినాయకుడు ప్రతిమ

ఊరూరా వినాయక సందడి

భీమునిపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ వినాయక చవితి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి.భీమునిపట్నంలోని నరసింహస్వామి గుడి రోడ్ గొల్లవీధిలో 12 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.నూకాలమ్మ గుడి వద్ద ఎగువపేట సామాజిక వేదికపై బాహుబలి సెట్ వేసి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 4వ వార్డులోని పలు ప్రాంతాల్లో కూడా మండపాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం బీచ్ రోడ్‌లో వినాయక విగ్రహాల నిమజ్జనాల ఊరేగింపుతో సందడి నెలకొంది.

కిక్కిరిసిన జోడుగుళ్లపాలెం తీరం

ఎండాడ : జీవీఎంసీ 8, 9 వార్డుల్లో వినాయక చవితి ఘనంగా జరిగింది. ఎండాడలో శాంతినగర్, వివేకానందనగర్, రాజీవ్‌నగర్, బీసీ కాలనీ, గొల్లల ఎండాడ గ్రామాల్లో ఆయా కాలనీల అసోసియేషన్లు గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు మండపాలు ఏర్పాటు చేశారు. 9వ వార్డులోని జోడుగుళ్లపాలెంలో ఏర్పాటు చేసిన గణేశ్ ప్రతిమను తూర్పు ఎమ్మెల్యే తనయుడు వెలగపూడి ప్రతాప్ రుద్ర దర్శించి, పూజలు జరిపారు. అలాగే విశాలాక్షినగర్ రెవెన్యూ కూడలిలో ఉత్తమ్ యూత్ అసోసియేషన్ 13 అడుగులు విగ్రహం ఏర్పాటు చేసింది. కాగా సాయంత్రం వినాయక ప్రతిమల నిమజ్జనాలతో జోడుగుళ్లపాలెం తీరం కిటకిటలాడింది. గతంలో పెదవాల్తేరు ఆర్టీసీ బస్సు డిపో ప్రాంతంలో నిమజ్జనాలు జరిగేవి. అక్కడి స్థానికులు నిమజ్జనాలను వ్యతిరేకించడంతో అధికారులు జోడుగుళ్లపాలెం మరో పాయింట్ ఏర్పాటు చేశారు. దీంతో ప్రతిమలను నిమజ్జనం చేయడానికి వచ్చిన వారితో జోడుగుళ్లపాలెం తీరం కిక్కిరిసిపోయింది.వాహనాల రద్దీతో తీర ప్రాంతం సందడిగా మారింది. తీరంలో రెండుచోట్ల సుమారు 60 మంది గత ఈతగాళ్లను ఏర్పాటు చేశారు.

తీర ప్రాంత గ్రామాల్లో...

సాగర్‌నగర్ :సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, రుషికొండలో వినాయక చవితి ఘనంగా జరిగింది. హెచ్ఐజీ టు పార్కులో సాగర్‌నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ప్రతిమను ఏర్పాటు చేశారు.

చంద్రంపాలెంలో...

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డులోని చంద్రంపాలెంలో సుమారు 41 అడుగుల మట్టి వినాయక ప్రతిమను ఏర్పాటు చేశారు. ఇక్కడ 70 ఏళ్ల నుంచి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈసారి ఎటువంటి రంగులు వినియోగించకుండా వాటర్ కలర్స్ వినియోగించి, ప్రతిమ ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన కళాకారులు నెల రోజుల పాటు శ్రమించి ఈ విగ్రహాన్ని తయారు చేసినట్టు వారు తెలిపారు.

సింహాచలంలో..

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు శిడగం వీధిలో శ్రీనివాసా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాళీయ మర్ధనుడి అలంకరణలో ప్రతిమను ఏర్పాటు చేశారు. అలాగే పోస్టాఫీసు వీధిలో సాయి గణేశ్ యువజన సంఘం ఆధ్వర్యంలో మహాభారతం రచిస్తున్న గణేశుడు ప్రతిమను ఏర్పాటు చేశారు. గోశాల కూడలిలో యువత ఏర్పాటు చేసిన దశావతారాల వినాయక బొమ్మ కూడా ఆకట్టుకుంటోంది.



కాళీయుడిపై వినాయకుడు

పద్మనాభంలో..

పద్మనాభం : మండలంలో గణపతి నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి.పద్మనాభం, కృష్ణాపురం,పాండ్రంగి, రేవిడి, వెంకటాపురం, కోరాడ, బీఆర్ తాళ్లవలస, అయినాడ, నేరేళ్లవలస గ్రామాల్లో భారీ గణేశ్ విగ్రహాలను నిలిపారు. పద్మనాభంలో యువకులు మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పద్మనాభం బీసీ వసతి గృహంలో విద్యార్థులు వసతి గృహ సంక్షేమాధికారి ధనరాజ్ ఆధ్వర్యంలో విగ్రహాన్ని నిలిపి పూజలు చేశారు.



భీమిలి గోస్తనీ సాగర సంగమం వద్ద నిమజ్జనాలు



జోడుగుళ్లపాలెం తీరంలో వినాయక నిమజ్జనాలు

రంగస్థల కళాకారుడు బాలుకు జాతీయ పురస్కారం



పద్మనాభం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది గ్రామానికి చెందిన రంగస్థల కళాకారుడు,అనంత పద్మనాభ నాట్యకళా మండలి అధ్యక్షుడు సామవేదం బాలసుబ్రహ్మణ్యం (బాలు), బళ్లారి రాఘవ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. వచ్చేనెల 6న కర్ణాటకలోని బళ్లారిలో జరిగే అవార్డు ప్రదానోత్సవానికి ఆహ్వానిస్తూ నిర్వాహకులు గురువారం లేఖ పంపించారు. బాలు పద్యనాటక కళాకారుడిగా హరిశ్చంద్రుడు, విశ్వామిత్రుడు, కృష్ణుడు తదితర ఎన్నో పాత్రలు పోషించి వందలాది ప్రదర్శనలిచ్చారు. తేనె తెలుగు కల్చరల్ ట్రస్టు గౌరవాధ్యక్షుడిగా కూడా వ్యవహరించారు. కళాభిషేకం ద్వారా ఉత్తరాంధ్రలో ఎంతోమంది కళాకారులను తీర్చిదిద్దారు. జాతీయ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల కళాకారులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భావి ఉపాధ్యాయుల ఆనంద హేల

... 5వ పేజీ తరువాయి

అందుబాటులో ఉంది. ధ్రువపత్రాలపై గెజిటెడ్ అధికారి సంతకం అవసరమనుకుంటే అక్కడ విధులు నిర్వహించి హైస్కూల్ హెచ్ఎంలు సంతకం చేశారు.

ఉదయం పది గంటల నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభించారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో ఒకేసారి పరిశీలన ప్రారంభం కావడంతో సర్వర్‌పై కొంత ఒత్తిడి పెరిగింది. దీంతో ఒక్కొక్క అభ్యర్థి ధ్రువపత్రాల పరిశీలనకు 15 నుంచి 20 నిమిషాల సమయం పట్టింది. మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరుగుతున్నప్పుడు పరీక్షలకు దరఖాస్తు చేసిన సమయంలో సమర్పించిన ధ్రువపత్రాలతో సరిపోల్చిన తరువాత వెరిఫికేషన్ అధికారి సెల్‌కు ఓటీపీ వస్తుంది. అక్కడితే పరిశీలన ప్రక్రియ పూర్తయినట్టుగా ప్రకటిస్తున్నారు. కొందరు మహిళా అభ్యర్థులు భర్త కులధ్రువీకరణ పత్రం తీసుకురాగా తిరస్కరించారు. తండ్రి కుల ధ్రువీకరణ పత్రం ప్రామాణికంగా తీసుకోవాల్సి ఉన్నందున సర్టిఫికెట్ తీసుకురావడానికి సమయం ఇస్తున్నారు. కాగా ధ్రువపత్రాల పరిశీలనకు జిల్లా పరిశీలకుడిగా నియమితులైన కేజీబీవీ విద్యాలయాల సెక్రటరీ దేవానందరెడ్డి మొత్తం ప్రక్రియను పర్యవేక్షించారు. అవసరమైన సూచనలు చేశారు. పాఠశాల విద్యా శాఖ విశాఖ ప్రాంతీయ సంచాలకుడు విజయభాస్కర్ నేతృత్వంలో విశాఖ డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ ధ్రువపత్రాల పరిశీలన చూస్తున్నారు. జిల్లాలో ఎంఈవోలు, హెచ్ఎంలు, ఇతర సిబ్బంది ధ్రువపత్రాల పరిశీలన విధులు నిర్వహించారు. సర్వర్ నెమ్మదిగా పనిచేయడంతో గురువారం రాత్రి వరకూ కొనసాగింది.

వినాయక విగ్రహం వద్ద అనధికార వసూళ్లు

... 5వ పేజీ తరువాయి

ప్రవేశ రుసుం వసూలు చేయరాదన్న పోలీసుల ఆదేశాలను నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. దర్శనం, పార్కింగ్, ఫొటోలు తీసుకునేందుకు, చివరకు అన్నదానం పేరిట కూడా నగదు వసూలు చేస్తున్నారు. బుధవారం వినాయక చవితి పండుగ సందర్భంగావివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా త్వరితంగా గణనాథున్ని దర్శనం చేసుకునేందుకంటూ టికెట్లు విక్రయించారు. వాహనాలకు పార్కింగ్ ఫీజు కూడా వసూలు చేశారు. ప్రతిదానికి టికెట్లు పెట్టడం పట్ల భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ విషయం గాజువాక పోలీసులకు తెలియడంతో వారు అక్కడకు చేరుకుని దర్శన టికెట్ల విక్రయాలను నిలిపివేయించారు. పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వినాయక విగ్రహం వద్ద ఎటువంటి ఫీజులు వసూలు చేయరాదని, టికెట్లు విక్రయించరాదని హెచ్చరించారు. నిర్వాహకులు హద్దుమీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిబంధనలను పాటిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించాలని సూచించారు.

సర్కారు బడుల్లో ఏఐ ల్యాబ్స్

... 5వ పేజీ తరువాయి

50 ఉన్నత పాఠశాలల్లో ఏఐ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తోంది. నాలుగు కోట్ల వ్యయంతో కంప్యూటర్లు, రోబోటిక్స్, స్మార్ట్ టెక్నాలజీ యంత్రాలు, హైబ్రాడ్‌బాండ్ ఇంటర్‌నెట్ సౌకర్యం, ఒక శిక్షణకుడిని సమకూర్చుతున్నారు. 50 పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ, యంత్రాల నిర్వహణ, ఇతరత్రా ఖర్చులకు ఏడాదికి రూ.80 లక్షలు వెచ్చించనున్నారు. విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏఐ ల్యాబ్స్ ఏర్పాటుచేస్తున్నారు. ఏఐ ల్యాబ్స్ ఏర్పాటుకు మౌలిక వసతులున్న ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా విద్యార్థులు ఉండే చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏఐ ల్యాబ్‌ను మంత్రి శుక్రవారం ప్రారంభిస్తారు. అనంతరం మిగిలిన పాఠశాలల్లో ఏర్పాటుచేసే ల్యాబ్స్‌ను రాడిసిన్‌బ్లూ హోటల్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఐటీ రంగంలో నూతన ఆవిష్కరణలు అందుబాటులో ఉండేందుకు ఏఐ ల్యాబ్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని సైయంట్ ప్రతినిధి ఒకరు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఐటీలో పట్టు సాధించేందుకు ల్యాబ్స్ ఎంతగానో దోహదడతాయన్నారు.



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఏఐ ల్యాబ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే గంటా

మధురవాడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) :చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏఐ ల్యాబ్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ ల్యాబ్‌ను రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ శుక్రవారం సందర్శించనున్నారు. ఈమేరకు ఎమ్మెల్యే ల్యాబ్‌ను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ సెయింట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ నియోజకవర్గంలో 28 ప్రభుత్వ పాఠశాలల్లో రూ. 8 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఏఐ ల్యాబ్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

జనసేనకు యువతే ప్రాణం

... 5వ పేజీ తరువాయి

అంతా కలిసిముందుకు సాగాల్సి ఉందన్నారు. అలయన్స్‌లో ఉన్నా పార్టీని ఎలా బలోపేతం చేయాలనే దానిపై అంతా దృష్టి పెట్టి పనిచేయాలని సూచించారు. నియోజకవర్గ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ఈ సమావేశంతో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, లోకం మాధవి, బొలిశెట్టి శ్రీనివాస్, పార్లమెంటు సభ్యులు బాలశౌరి, ఎమ్మెల్సీ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సౌభాగ్యం కోసమే జనసేన

దేశ సౌభాగ్యం కోసమే జనసేన ఆవిర్భవించిందని, ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేస్తారని ఆ పార్టీ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రకటించారు. 'సేనతో..సేనాని' పేరిట జనసేన విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ గురువారం విశాఖపట్నం వచ్చి బీచ్‌రోడ్డులోని బే వ్యూ హోటల్‌లో లెజిస్లేచర్ సమావేశం నిర్వహించారు. అందులో చర్చించిన విషయాలను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఎమ్మెల్సీ హరిప్రసాద్‌లు సాయంత్రం మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ, స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ జరుగుతున్నదంటూ వైసీపీ దుష్ప్రచారం చేస్తున్నదని, అదంతా అవాస్తవమన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలో ఉన్నంత వరకు అది సాధ్యం కాదన్నారు. స్టీల్ ప్లాంటుపై తొలుత స్పందించింది పవన్‌కల్యాణేనని, ఆయన ఢిల్లీ వెళ్లి అమిత్ షాతో మాట్లాడి ప్రైవేటీకరణ ఆపించారన్నారు. ఆ తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి స్టీల్‌ప్లాంటుకు రూ.14 వేల కోట్ల ఆర్థిక సాయం ఇప్పించారన్నారు. వైసీపీలా తాము స్టీల్ ప్లాంటు భూముల కోసం ములాఖత్ కాలేదన్నారు. ఆ ప్లాంటు కోసం కేప్టివ్ మైన్స్‌తో పాటు ప్రత్యేకమైన పైపులైన్ కూడా పవన్‌కల్యాణ్ డిమాండ్ చేశారన్నారు. పవన్ కల్యాణ్ పార్టీని పదిహేనేళ్లుగా నడుపుతున్నారని, ఆయన నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి అంతా ఆయన వెనుక నడుస్తున్నామన్నారు. రిజిస్టర్ పార్టీ నుంచి రికగ్నిషన్ పొందిన పార్టీగా జనసేన మారిందన్నారు. ఒక సీటు కూడా లేని పార్టీ పోటీ చేసిన 21 స్థానాల్లో ప్రతి సీటును గెలుచుకొని 100 శాతం స్ట్రైక్ రేటు సాధించిందన్నారు. ఒకానొక సమయంలో పార్టీని విలీనం చేయాలని చాలామంది ఆయన్ను కోరారని, కానీ ఆయన ఆ దిశగా ఏనాడూ ఆలోచన చేయలేదన్నారు. రాష్ట్రం విడిపోయిన తరువాత నిలదొక్కుకోలేకపోతున్నదని బాధ పడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం పవన్ కల్యాణ్ కూటమికి మద్దతు ఇచ్చారన్నారు. అది నిరంతరం కొనసాగుతుందని స్పష్టంచేశారు. గతంలో పవన్ కల్యాణ్ విశాఖపట్నం వస్తే వైసీపీ పార్టీ నాయకులు అనేక అడ్డంకులు సృష్టించారని, నోవాటెల్‌లో నుంచి బయటకు రాకుండా ఆంక్షలు పెట్టారన్నారు. అదే విశాఖపట్నంలో ఇప్పుడు పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నామని, ఇక్కడ మీటింగ్ పెట్టిన ప్రతిసారి రాష్ట్రానికి మేలు జరుగుతున్నదని సుందరపు పేర్కొన్నారు. పార్టీని బలోపేతం చేసే దిశగా నాయకులు, కార్యకర్తలకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేస్తున్నారన్నారు. ఈ రాష్ట్ర అభివృద్ధికి దిశ, దశ సూచించేలా ఈ సమావేశాలు ఉంటాయన్నారు.

బ్యాంకాక్, మలేషియా, కొలంబో విమానాలు పునరుద్ధరించండి

... 5వ పేజీ తరువాయి

చెప్పారు. ప్రయాణికుల బ్యాగేజీలను స్కాన్ చేసే ఎక్స్‌రే యంత్రాలు నాలుగు ఉండగా వాటిలో రెండు నిత్యం మొరాయిస్తున్నాయని పలువురు ఆరోపించగా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని విమానాశ్రయం అధికారులు హామీ ఇచ్చారు. గోవా, పుణేలకు 85 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్న విమానాలను ఆపేశారని, వాటిని ఎప్పుడు పునరుద్ధరిస్తారని ఎంపీ ప్రశ్నించగా...ప్రయత్నాలు చేస్తున్నామని అధికారులు సమాధానమిచ్చారు. ప్రయాణికులకు తక్కువ ధరకు ఆహార పదార్థాలు అందించడానికి ఉడాన్ యాత్రీ కేఫ్‌ను విశాఖ ఎయిర్‌పోర్టులో కూడా ప్రారంభించాలని ఎంపీ సూచించారు. నేరుగా విదేశాలకు వెళ్లే అంతర్జాతీయ విమానాలపై దృష్టి పెట్టాలన్నారు. బ్యాంకాక్, మలేషియా, కొలంబో విమానాలను పునరుద్ధరించాలన్నారు. వాష్ రూమ్‌ల నిర్వహణ సరిగ్గా ఉండడం లేదని తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని వాటిపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. అదనపు స్లాట్లు కేటాయించాలని నేవీ అధికారులను కోరగా, పైలట్లకు శిక్షణ ఇస్తున్నామని, ప్రస్తుతం కేటాయించలేమని స్పష్టంచేశారు.

శ్రీవాణి-తిరుపతి విమానంపై చర్చ

విశాఖ నుంచి తిరుపతి వెళ్లే విమాన ప్రయాణికులకు శ్రీవాణి టికెట్లు లభించడం లేదని ఇటీవల 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై సమావేశంలో చర్చ జరిగింది. కమిటీ సభ్యులు ఒ.నరేశ్‌కుమార్ మాట్లాడుతూ, ఉదయం 8 గంటలకల్లా తిరుపతికి విమానం వెళ్లేలా సమయాలు మార్చాలని కోరారు. దీనిపై ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, అటు నుంచి విమానాన్ని మధ్యాహ్నం కాకుండా సాయంత్రం వీలైనంత ఆలస్యంగా నడపాలని సూచించారు.

నగరానికి చేరుకున్న మంత్రి నారా లోకేశ్

... 5వ పేజీ తరువాయి

అధ్యక్షుడు గండి బాబ్జీ, విశాఖ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ తదితర నాయకులు కలిశారు.

నేడు కార్యక్రమాలకు హాజరుకానున్న లోకేశ్

మంత్రి లోకేశ్ శుక్రవారం ఉదయం 11 గంటలకు పీఎం పాలెంలోని వైజాగ్ కన్వెన్షన్‌లో అర్థ సమృద్ధి ఐసీఏఐ నేషనల్ కాన్ఫరెన్స్‌కు హాజరవుతారు. అక్కడ నుంచి 11.30 గంటలకు చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి ఏఐ ల్యాబ్స్‌ను ప్రారంభించి, విద్యార్థులతో మాట్లాడతారు. మధ్యాహ్నం 12.15 గంటలకు చంద్రంపాలెం పాఠశాల నుంచి బయలుదేరి రుషికొండలోని రాడిసిన్ బ్లూ హోటల్‌కు చేరుకుని ఏఐ ల్యాబ్స్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తారు. మధ్యాహ్నం మూడు గంటలకు నోవాటెల్ హోటల్‌కు వెళ్లి ఏరోస్పేస్ మ్యాన్యుఫ్యాక్చరింగ్‌పై సీఐఐ నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సుకు హాజరవుతారు. సాయంత్రం నాలుగు నుంచి 5.30 గంటల వరకు ఏయూ కన్వెన్షన్ హాలులో జరిగే జాతీయ క్రీడా దినోత్సవంలో పాల్గొంటారు. సాయంత్రం ఆరు నుంచి 7.30 గంటల వరకు రాడిసిన్ బ్లూ హోటల్‌లో భారత మహిళా క్రికెట్ జట్టుతో మర్యాదపూర్వకంగా భేటీ కానున్నారు. అనంతరం పార్టీ కార్యాలయానికి చేరుకుని రాత్రికి బస చేస్తారు.

ఉప ముఖ్యమంత్రికి మేయర్ పీలా, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ స్వాగతం



పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న మేయర్ పీలా, సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ

వెంకోజీపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : 'సేనతో సేనాని' బహిరంగ సభకు విశాఖ నగరానికి విచ్చేసిన ఏపీ ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా విశాఖ విమానాశ్రయంలో నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. విశాఖలో ఈ బహిరంగ సభ నిర్వహించడం ఆనందంగా ఉందని ఉప ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు.

స్టీల్‌ప్లాంటు బీఎఫ్ విభాగంలో చోరీపై ఫిర్యాదు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటు బ్లాస్ట్‌ఫర్నేస్-3 విభాగంలోని పాత కాపర్ ప్లేట్లు చోరీకి గురయ్యాయని పేర్కొంటూ విభాగం అధి కారి గురువారం ప్లాంటు క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ప్లాంట్ బీఎఫ్ విభాగంలో జూన్ నెలలో తొలగించిన 45 స్క్రాప్ కాపర్ ప్లేట్లను స్టోర్సులో భద్రపరిచారు. అయితే ఈ నెల 22న అధికారులు స్టోర్సులో పరిశీలించగా ఆరు కాపర్ ప్లేట్లు కనిపించలేదు. జూన్ 12 నుంచి ఈ నెల 22 మధ్యలో చోరీ జరిగి ఉంటుందని, ఈ ప్లేట్ల విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో అధికారి పేర్కొన్నారు.

నగర మేయర్‌ను కలిసిన ట్రైనీ ఐఏఎస్ సాహిత్

వెంకోజీపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావును అల్లూరి సీతారామరాజు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ కె.చిరంజీవి నాగవెంకటసాహిత్ జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 2024 బ్యాచ్‌కు చెందిన ప్రొబేషనర్ అధికారి జీవీఎంసీ అభివృద్ధి కార్యక్రమాలపై ట్రైనీ ఐఏఎస్ అధికారిగా ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు నగరంలోని పలు ప్రాజెక్టులను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్‌ను ట్రైనీ ఐఏఎస్ కలిశారు. అనంతరం నగర మేయర్ పీలా మాట్లాడుతూ విశాఖ నగర ప్రజలు ఎంతో సౌమ్యులని, ఇక్కడ పని చేసే అధికారులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. అలాగే ఇంకా మురికివాడలు, పాత నగరం, జీవీఎంసీ కొత్తగా చేపడుతున్న ప్రాజెక్టులు తదితర వాటిని కూడా పరిశీలించాలని మేయర్ ట్రైనీ కలెక్టర్‌ను సూచించారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 36, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 30, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 40, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె) 10, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 74, బరబాటి 28, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 74, కీరదోస 30, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	108
లైవ్ ధర	128
విత్ స్కిన్	226
స్కిన్‌లెస్	236



సిరిపురం : చవితి ఉత్సవాల్లో పాల్గొన్న వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్



ఆరిలోవ : చినగదిలిలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో 25 అడుగుల వినాయక విగ్రహం



ఎంవీపీ కాలనీ : ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

చవితి సందడి

- ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు
- మండపాల్లో భక్తి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వినాయక నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఎటు చూసినా వినాయక చవితి సందడి కనిపిస్తోంది. ఒక్కో చోట ఒక్కో రూపంలో వినాయకుడి విగ్రహాలు ఏర్పాటుచేయడంతో చూసేందుకు భక్తులు క్యూ కడుతున్నారు. ఎంవీపీ కాలనీ అయిదో సెక్టరు రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక పూజలకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, సతీమణి సుజన, కుమారుడు ప్రతాప్‌రుద్రతో హాజరయ్యారు. శివాలయంలో శ్రీసిద్ధి వినాయక పార్వతీ ముక్తేశ్వర సాయిరాం భక్త మండలి సభ్యులు నిర్వహించిన భక్తి గానం ఆహూతులను అలరించింది. భావరాజు వీరభద్రమ్మ ఆధ్వర్యంలో సంగీత కచేరి నిర్వహించారు. ఎంవీపీ కాలనీ టీటీడీ సర్కిల్ వద్ద విశాఖ రియల్ ఎస్టేట్ సభ్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉత్సవాలలో వీఎమ్మార్డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అయిదో సెక్టరులోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చవితి పందిరిలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతుబజార్‌లో ఎస్టేట్ అధికారి వరహాలు ఆధ్వర్యంలో రైతులు చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వాడవాడలా వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ సంఘాలు, యువకులు వీధివీధినా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. పాత వెంకోజీపాలెంలోని శ్రీసీతారామ యూత్ ఆధ్వర్యంలో 11 అడుగుల శివుడి ఆకారంలో ఏర్పాటు చేసిన వినాయక మట్టి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పూజా కార్యక్రమాల్లో శ్రీ సీతారామ సేవా సంఘం అధ్యక్షుడు కర్రి వెంకట సూరి అప్పారావు, ఇతర కార్యవర్గ సభ్యులు, యూత్ సభ్యులు, మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు. పాత వెంకోజీపాలెం శ్రీశెట్టి బలిజ సేవా సంఘం, శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం కొత్త వెంకోజీపాలెంలోని ఆటోస్టాండ్ గ్రామ సేవా సంఘం, ఎలియాన్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు భారీ ఎత్తున జరిపారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను కొనసాగించనున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.

గ్రేటర్ పరిధిలోని 15, 16 వార్డుల్లో ఎటుచూసినా తండ్రి శివుడి రూపంలోనే తనయుడు విఘ్నేశ్వరుడు విగ్రహాలు ఈ ఏడాది దర్శనమిచ్చాయి. అందరూ అనుకుని ఏర్పాటు చేసినట్టుగా ఒకే రూపంలో చిన్నా, పెద్ద విగ్రహాలను ప్రతిష్ఠించారు. పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా రూపంలోనే కాదు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయడంలోనూ అందరూ ఒకే బాట పట్టారు. ఈ విగ్రహాలను దర్శించుకున్న భక్తులకు ఆశ్చర్యాన్ని నిర్వాహకులు కలిగించారు. ఎక్కడకు వెళ్లిన ఒకే తరహా విగ్రహాన్ని, సైజులు మాత్రం తేడాలో దర్శించుకున్నట్టు ఉందని భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఒకే రకమైన విగ్రహాలతో పాటు కనువిందు కలిగించేలా స్టేజ్‌లను కూడా రూపుదిద్దడం పట్ల భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : చినగదిలిలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 25 అడుగుల వినాయక విగ్రహం ఈ ప్రాంతానికే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ విగ్రహాన్ని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. అలాగే శ్రీకాంత్‌నగర్‌లో హనుమంతుని రూపంలో వినాయక విగ్రహం ఆకట్టుకుంటోంది.

జీవీఎంసీ 11వ వార్డుకు చెందిన క్యాటరింగ్ రాజు వినాయక మండపాలకు వేలం లడ్డూలను ఉచితంగా అందించారు. ఓం సాయిరాం కేటరింగ్ అధినేత కాకి గంగరాజు చిన్న మండపాలకు మూడు కిలోల లడ్డూ, మధ్యస్థ మండపాలకు ఐదు కిలోలో లడ్డూ, పెద్ద మండపాలకు ఎనిమిది కిలలోల లడ్డూలను మండపాల నిర్వాహకులకు అందించారు. ఇది తన చిరు కానుక అని ఆయన పేర్కొన్నారు. నిర్వాహకులు రాజుని అభినందించారు.



కృష్ణా కళాశాల రోడ్డులోని అలియన్స్ కళాశాల వద్ద..

పూజల్లో పాల్గొన్న వీఎంఆర్డీఏ చైర్మన్

సిరిపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితిని పురస్కరించుకొని పలు ప్రాంతాల్లో నిర్వహించిన చవితి ఉత్సవాల్లో వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి సంపత్ వినాయకుని ఆలయంలో స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఎంవీపీ కాలనీలోని టీటీడీ కూడలి వద్ద విశాఖ రియల్ ఎస్టేట్ సభ్యుల సంక్షేమ సంఘం నిర్వహించిన చవితి ఉత్సవంలో పాల్గొనగా సంఘం అధ్యక్షుడు నరసింహారావు నేతృత్వంలోని ఆయనను సత్కరించారు. తదుపరి భీమిలిలోని గీతం కాలేజీ విద్యార్థులు నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొన్నారు. తదుపరి దక్షిణ నియోజకవర్గంలోని యువత నిర్వహించిన ఉత్సవం, మద్దిలపాలెం రామాలయం వద్ద ఉత్సవంలోని పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరిహారం అందజేత



ఫిషింగ్ హార్బర్ వద్ద వెల్డింగ్ షాపులోజరిగిన పేలుడు ప్రమాదంలో మృతి చెందిన సన్యాసిరావు కుటుంబానికి పరిహారం చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, తహసీల్దార్ పాల్‌కిరణ్

ఆరిలోవ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) :నగరంలో గల ఫిషింగ్ హార్బర్ వద్ద వెల్డింగ్ షాపులో ఇటీవల జరిగిన పేలుడు ప్రమాదంలో మృతి చెందిన 12వ వార్డు పరిధిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన తాండ్రంగి సన్యాసిరావు (40) భార్య సంతోషికి పరిహారం కింద ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల పరిహారం చెక్‌ను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, చినగదిలి తహసిల్దార పాల్ కిరణ్ గురువారం మృతుడి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ.. మృతి చెందిన సన్యాసిరావు టీడీపీ సభ్యత్వం తీసుకున్నందున పార్టీ ద్వారా అమలు చేసిన బీమా పరిహారం రూ.ఐదు లక్షలు కూడా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, టీడీపీ 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి పోలారావు, కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు, స్థానిక నేతలు గోపల్లి రామకృష్ణ, బసవ దేవుళ్లు, స్థానిక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీతో నిరుద్యోగులకు అండగా ప్రభుత్వం

- వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్

సిరిపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చినమాటనిలబెట్టుకొని అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి తొలి సంతకం పెట్టడమే కాకుండా మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించి వారాల వ్యవధిలో ఫలితాలు ప్రకటించడం చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ పరీక్ష ద్వారా ఒకేసారి 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారని తెలిపారు. ఇది కేవలం ఉద్యోగాల భర్తీ మాత్రమే కాదని, వేలాది కుటుంబాల భవిష్యత్ నిర్మాణమని పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి రాగానే లూలుమాల్‌ను విశాఖకు తీసుకురావడం జరిగిందని, విశాఖ కేంద్రంగా రతన్‌టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభమైందన్నారు. విశాఖలో ఐటీ కార్యకలాపాలను విస్తరించాలనే ఉద్దేశంతో కాగ్నిజెంట్ సంస్థ ముందుకొచ్చిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో మెట్రో ప్రాజెక్టును గాలికి వదిలేస్తే, కూటమి అధికారంలోకి రాగానే మెట్రో ప్రాజెక్టుపై కూడా ప్రణాళికలు రూపొందించిందని, అతి త్వరలోనే మెట్రో పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు.

పార్టీ కోసం పని చేసే వారికే కమిటీల్లో ప్రాధాన్యం : ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం పని చేసే వారికి ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని, అలాంటి వారికే వివిధ స్థాయిల్లో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణబాబు మాట్లాడుతూ కొద్ది రోజుల్లో వార్డు స్థాయి కమిటీల ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రణాళిక ప్రకారం ఆయా తేదీల్లో వార్డు స్థాయి కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసుకుని, ఆమోదయోగ్యమైన నాయకులను కమిటీల్లో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చోడె పట్టాభిరామ్, ఒమ్మి సన్యాసిరావు, జీవీఎంసి కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, కార్యదర్శులు, క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌ఛార్జిలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

డీశాలినేషన్ ప్లాంటు నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

వెంకోజీపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : డీశాలినేషన్ ప్లాంటు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. విశాఖ పరిధిలోని అప్పికొండ ప్రాంతంలో నిర్మించనున్న 100 ఎంఎల్‌డీ డిసాలినేషన్ ప్లాంట్ నిర్మాణంపై గురువారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ పల్లమరాజు, తాగునీటి విభాగం పర్యవేక్షక ఇంజనీరు కేవీఎన్ రవి, పర్యవేక్షక ఇంజనీర్ ఏడుకొండలు, ఇతర అధికారులు, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఏపీయూఐఏఎంఎల్) ఇజ్రాయెల్‌కు చెందిన ఐడీఈ టెక్నాలజీస్ లిమిటెడ్ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రాథమిక అంచనాల ప్రకారం ప్లాంటు నిర్మాణానికి రూ.1200 కోట్లు ఖర్చు అవుతుందని, ప్లాంట్ నిర్మాణ పనులు చేపట్టాలంటే ప్రస్తుతం ప్లాంట్ కోసం మౌలిక వసతులు, సామగ్రి నిల్వ సదుపాయాలు, అంతర్గత రహదారుల ఏర్పాటు తదితర వాటి కోసం సుమారు 25 ఎకరాల భూమి అవసరం అవుతుందన్నారు. దీన్ని పబ్లిక్-ప్రైవేటు పార్టనర్షిప్ (పీపీపీ) కింద ఏర్పాటుకు నిర్ణయించినట్టు వెల్లడించారు. ప్రైవేటు సంస్థలు ఆర్థిక పెట్టుబడి పెడతాయని జీవీఎంసీ భూమి కేటాయింపు, ప్రాజెక్టు అమలుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని కమిషనర్ తెలిపారు. ఇప్పటికే అనుభవం ఉన్న ఐడీఈ టెక్నాలజీస్ ముంబైలో 400 ఎంఎల్‌డీ, తమిళనాడులో 60 ఎంఎల్‌డీ డీశాలినేషన్ ప్లాంట్లు అభివృద్ధి చేసిందని, అలాగే ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు ఐడీఈ టెక్నాలజీస్ లిమిటెడ్ సాంకేతిక భాగస్వామిగా వ్యవహరిస్తుందని కమిషనర్ తెలిపారు.

ఎండాడలో ఏఐ ల్యాబ్

- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న విద్యాశాఖా మంత్రి లోకేశ్

ఎండాడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైయెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ల్యాబ్‌ను రాష్ట్ర విద్య, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. సైబల్స్ పేరుతో ఏర్పాటుచేసిన ల్యాబ్‌లో విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పాఠ్యాంశాలు బోధించడంతో పాటు మంచి వాతావరణంలో ప్రయోగాలు చేయడానికి వీలుగా ఏర్పాట్లు చేశారు. స్టెమ్‌రోబో సహకారం అందించనుంది. విద్యార్థులకు ఏఐ సంబంధిత ప్రాజెక్టులు, పరిశోధన, ప్రయోగాలు చేయడానికి ఉపయోగకరంగా రూపొందించారు వాస్తవ ప్రపంచ సమస్యలకు సైద్ధాంతిక విజ్ఞానాన్ని విద్యార్థులకు వివరించేలా ల్యాబ్‌ను తీర్చిదిద్దారు. పాఠశాల విద్యలోనే ఏఐపై అవగాహన, జ్ఞానం అవసరమని గుర్తించిన ప్రభుత్వం ఈ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

సంపత్ వినాయగర్ ఆలయంలో ఘనంగా నవరాత్రి చవితి మహోత్సవాలు

- తెల్లవారుజామున 4 గంటల నుంచే భక్తులకు స్వామివారి దర్శనం
- తొలి రోజు దర్శించుకున్న రాష్ట్ర హోంమంత్రి, పలువురు ఎమ్మెల్యేలు
- రెండో రోజు శ్రీబాలగణపతిగా స్వామివారు దర్శనం



పూజలు అందుకుంటున్న స్వామివారు

సిరిపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ శ్రీసంపత్ వినాయగర్ దేవాలయంలోని వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం తెల్లవారుజాము ఉదయం 4 గంటలకు సంపత్ వినాయగర్ అలంకరణలోని స్వామివారికి భక్తులకు దర్శనమిచ్చారు. తదుపరి గణపతి హోమం, నాదస్వర కచేరి, ఉభయదాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రసాదవితరణ చేపట్టారు.సాయంత్రం 4 గంటల నుంచి నాదస్వర కచేరీ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగంలోని భాగంగా శ్రీగణేష్ పురాణంపై కందుకూరి వేంకట సత్యబాల సుబ్రహ్మణ్యశర్మ.. ప్రవచనం వినిపించారు. తొలి రోజు స్వామివారిని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యేలు రమేష్‌బాబు, గణబాబు, నేవీ చీఫ్ అడ్మిరల్ ఇతర ప్రముఖులు దర్శించుకున్నట్టు ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు తెలియజేశారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు సుమారు 30 వేల మందికి వరకు భక్తులకు దర్శించుకున్నారని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను ఆలయ ఈవో, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్, సిబ్బంది జి. గోవిందరెడ్డి పర్యవేక్షించారు.

రెండో రోజు బాలగణపతిగా దర్శనం..

సంపత్‌వినాయగర్‌ఆలయంలో స్వామివారు గురువారం బాలగణపతి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో సుమారు 1800 మందికి వరకు నారాయణ సేవ చేపట్టినట్టు ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు తెలియజేశారు.ఉదయం సౌందర్యలహరి బృందం, పి.వేంకటరత్నంతో శివపార్వతీ కల్యాణ గానామృతం, శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్టు మహిళా బృందం కోలాటం, నృత్యభారతి అకాడమీ వి.మోనిక పట్నాయక్ కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు.

అలరించిన ఖడ్గతిక్కన పద్య నాటకం

మద్దిలపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన శ్రీఖడ్గ తిక్కన పద్యనాటకం ఆద్యంతం రక్తి కట్టించింది. విజయవాడకు చెందిన శ్రీసాయి బాబా నాట్యమండలి నిర్వహణలో పీవీఎన్ కృష్ణ దర్శకత్వం వహించగా 38 మంది నటనటీమణులు అద్భుత ప్రదర్శనలతో కళాభిమానులను మంత్రముగ్ధులను చేశారు. ఆవు జున్ను వల్ల రాజుల మధ్య యుద్ధం ఎలా ప్రారంభమైంది, యుద్ధంలో పన్నిన కుతంత్రాలతో వాటిల్లిన నష్టం వివరిస్తూ సాగిన శ్రీఖడ్గ తిక్కన పద్యనాటకం అందర్ని ఆలోచింపజేసింది. రాజుల వేషధారణలతో ఆలపించిన పద్యాలు, ప్రదర్శనలకు ఆడిటోరియం ప్రేక్షకుల కరతాలధ్వనులతో మారుమోగింది. ముందుగా కళాభారతి కార్యదర్శి మాట్లాడుతూ ఆరు రోజుల పాటు నిర్వహించిన తమ జాతీయ పురస్కార ఉత్సవాలకు విశేష స్పందన లభించిందన్నారు. కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు, ఫైడా కృష్ణ ప్రసాద్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ఆశ వర్కర్ల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ వర్కర్లు

సిరిపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆశ వర్కర్లు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ విశాఖ జిల్లా ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ముందుగా ఆశ వర్కర్స్ జీవీఎంసీ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆశా వర్కర్స్‌కు కనీస వేతనాలు చెల్లిస్తామని పేర్కొన్నదని తెలిపారు. ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో పని భారం, యాప్ భారం పెరిగిన నేపథ్యంలో వేతనాలు పెంచాల్సిన అవసరం చాలా ఉందన్నారు. ప్రభుత్వం ఆశ వర్కర్ల పనిని, ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి వేతనాలను తక్షణమే పెంచాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.పద్మ, వి.మేరీ, కోశాధికారి వై.సీతారత్నం, దయానా, జయలక్ష్మీ, లీలావతి, వరలక్ష్మీ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

దేవుడి పేరిట వసూళ్లకు పాల్పడే వారిపై చర్యలు చేపట్టాలి

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాక, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భక్తి పేరిట భారీ గణనాథుని విగ్రహాలను ప్రతిష్ఠించి క్యూ లైన్లు, పార్కింగ్, షాపులు, అన్నదానం పేరిట ప్రజల ఉంచి నగదు వసూలు చేయడం భావ్యం కాదని, అటువంటి వారిపై అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవుడి సేవ పేరుతో వ్యాపారాలు చేసి ప్రయోజనం పొందాలనుకోవడం గౌరవప్రదమైన చర్య కాదన్నారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ బొండా జగన్, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, మొల్లి పెంటిరాజు, సాలాపు రామారావు, ఉరుకూటి అప్పలరాజు, అఫీజా, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలపడమే లక్ష్యం

» ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు

కంచరపాలెం,ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పరంగా ఉత్తర నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలపడానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. 47వ వార్డు సురేశ్‌రామ్ నగర్‌లో రూ.1.24 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అధిక భాగం కొండలపై ఉందన్నారు. ఈ నేపథ్యంలో కొండవాలు గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పనకు పెద్దపీట వేస్తూ పనులు చేపడుతున్నామన్నారు. ఈ పనుల్లో భాగంగా రిటర్నింగ్ గోడలు, కాలువలు, డ్రైన్లు, సామాజిక భవనాలు, రోడ్లు నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. పేదలకు మౌలిక వసతులను చేరవేయడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కుంటిపాము కామేశ్వరీ, స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

సీతంపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నగర సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించి, కేసులు త్వరగా పరిష్కరించాలని సూచించారు. స్టేషన్ ఆవరణలో చెట్లు, వాహనాలు అడ్డదిడ్డంగా ఉన్నాయని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అలాగే జనరేటర్ స్థలాన్ని పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. స్టేషన్ పరిసరాలు శుభ్రంగా ఉండేటట్టు చర్యలు చేపట్టాలన్నారు.

రూ.25 లక్షల విలువగల సెల్‌ఫోన్లు రికవరీ

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో, ప్లాట్‌ఫామ్‌లపై చోరీకి గురైన రూ.25 లక్షల విలువగల 100 సెల్‌ఫోన్‌లను రైల్వే పోలీసులు రికవరీ చేసి బాధితులకు గురువారం అందజేశారు. ఈ రికవరీలో ఎస్‌ఐలు కేటీఆర్.లక్ష్మి, ఎస్.రామారావు, హెడ్ కానిస్టేబుల్ ఉదయ్ భాస్కర్, కానిస్టేబుళ్లు బి.మహేశ్, జి.దుర్గాప్రసాద్, టీజే.వర్మ, రాజేశ్ బృందం దర్యాప్తు చేపట్టి హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, కాకినాడ, రాజమహేంద్రవరం, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాల్లో ఉన్నాయని గుర్తించి బాధితులకు అందజేశారు.

తెలుగు భాషా దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

డాబాగార్డెన్స్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) :వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో జరిగే తెలుగు భాషా దినోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు వేడుకలు ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే గిడుగు రామ్మూర్తి పంతులు పురస్కార గ్రహీతలను ఎంపిక చేశారు. వారికి రూ. 25 వేల నగదు, జ్ఞాపిక అందజేయనున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. అలాగే కమిటీ సభ్యులు బుద్ధ ప్రసాద్, రాష్ట్ర సృజనాత్మక ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి, కమిటీ కన్వీనర్ ఆర్. మల్లికార్జునరావు పాల్గొనున్నారు.

బాలల సంరక్షణ కమిటీ సమావేశం

మహారాణిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కుల పరిరక్షణకు కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో బాలల సంరక్షణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలల విద్య, బాల్య వివాహాల నిషేధం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల హక్కులు తదితర అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో శిశు సంక్షేమ శాఖాధికారి కేవీ రామలక్ష్మి, దిల్సా కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు, తదితరలు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలిక

మహారాణిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి రోజున తప్పిపోయిన నాలుగేళ్ల బాలికను గంటల వ్యవధిలో పోలీసులు ఆమె తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కొబ్బరితోట ప్రాంతానికి చెందిన నీలిమా నక్షత్ర (4) సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. తల్లిదండ్రులు, ఇతర కుటుంబీకులు పండగ సందడిలో పాప సంగతి మరచిపోయారు. గంట తరువాత పాప కోసం వెతకగా ఎక్కడా కనిపించలేదు. దీంతో వారు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ సతీశ్ ఆధ్వర్యంలో సిబ్బంది గాలించారు. రాత్రి 9 గంటల సమయంలో పాప ఇంటికి కొద్ది దూరంలో ఉన్నట్టు గుర్తించి, ఆమెను తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

శ్రమించారు, సాధించారు

... 5వ పేజీ తరువాయి

అనుకున్నది సాధించారు.

చోడవరం మండలం రేవళ్ల గ్రామానికి చెందిన గనివాడ సత్యనారాయణకు ఇద్దరు కుమార్తెలు. ఉపాధ్యాయునిగా పనిచేయాలని సత్యనారాయణ ఆశపడినా కోర్కె నెరవేరలేదు. అయితే తాను చేయాలనుకున్న టీచర్ ఉద్యోగంలో తన ఇద్దరు కుమార్తెలను చూడాలనుకున్న సత్యనారాయణ అదే ఆశయంతో చదివించారు. పెద్దకుమార్తె ఉపాధ్యాయురాలిగా ఎంపికై ప్రస్తుతం పాడేరు సమీపాన ఒక స్కూలులో పనిచేస్తున్నారు. రెండో కుమార్తె సుజాత ఇటీవల నిర్వహించిన డీఎస్సీ (ఎస్జీటీ)లో ఏకంగా జిల్లాస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించి తండ్రి లక్ష్యాన్ని నేరవేర్చారు.

చెప్పలేనంత ఆనందంగా ఉంది

గనివాడ సుజాత, ఎస్జీటీ ప్రథమ ర్యాంకరు

ఎస్జీటీ కేటగిరీలో ప్రథమ ర్యాంకు వచ్చినందుకు చెప్పలేనంత ఆనందంగా ఉంది. తండ్రి ఆశయం కోసం కష్టపడి చదివాను. ఇప్పుడు ఆయన లక్ష్యం, ఆశయం నెరవేరడం సంతోషంగా ఉంది. డీఎస్సీ నిర్వహిస్తామన్న ప్రభుత్వం హామీ నిలబెట్టుకుంది. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే ఆశయంగా పనిచేస్తాను.

అవమానించిన చోట విజయగర్వంతో మరొకరు..

మాడుగుల మండలం జమ్మాదేవిపేటకు చెందిన తాటికొండ ధనలక్ష్మిది పేద కుటుంబం. భర్తకు అర ఎకరా పొలం మాత్రమే ఉంది. వారికి ఇద్దరు పిల్లలు. చదువు పట్ల ధనలక్ష్మిలో ఆసక్తిని గమనించిన భర్త అనేక కష్టాలకు ఓర్చి చదివించారు. ఇద్దరు పిల్లలు కలిగిన తరువాత చదువు ఎందుకు? అంటూ గ్రామంలో అనేకమంది హేళన చేశారు. అన్నింటినీ భరిస్తూ డీఎస్సీకి ప్రిపేరైన ధనలక్ష్మి ఎస్జీటీ కేటగిరీలో జిల్లాలో ఏకంగా రెండో ర్యాంకు సాధించారు. అవమానాలు ఎదుర్కొన్న చోటే..భర్తను తల ఎత్తుకునేలా చేశారు.

మా జీవితాల్లో వెలుగులు నింపింది

తాటికొండ ధనలక్ష్మి, ఎస్జీటీ రెండో ర్యాంకు,

ఎస్జీటీ కేటగిరీలో రెండో ర్యాంకు సాధించడం ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం మా కుటుంబంలో వెలుగులు నింపింది. నాకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. చదువంటే చాలా ఇష్టం. నా ఇష్టాన్ని గుర్తించి నా భర్త చదివించారు. మా గ్రామంలో కొంతమంది నా భర్తను, నన్ను హేళన చేశారు. అయినా వెనకడుగువేయకుండా కష్టపడి చదివాను. విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలిగించేలా బోధన చేస్తాను.



కళింగనగర్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన 24 అడుగుల ప్రతిమ



బర్మా క్యాంప్ శ్రీనివాసనగర్‌లో ఛత్రపతి శివాజీగా...



వీణ గణపతి అలంకరణలో దర్శనమిస్తున్న దుర్గా గణపతి

వీధి వీధినా.. వినాయకుడు

మర్రిపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ వినాయక చవితి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. 53వ వార్డులోని మర్రిపాలెంలో పలు కాలనీల్లో మండపాలు నిర్మించి, ప్రతిమలను ఏర్పాటు చేశారు. శ్రీహర్షనగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ వినాయక ప్రతిమ ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజుల పాటు ఇక్కడ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



రామకృష్ణానగర్‌లో ఏర్పాటు చేసిన 30 అడుగుల భారీ విగ్రహం

అక్కయ్యపాలెంలో..

అక్కయ్యపాలెం : జీవీఎంసీ 26, 27, 42, 43, 44, 45, 46 వార్డుల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా ప్రాంతాల్లో నిర్వాహకులు వివిధ రూపాల్లో గణపతి విగ్రహాలను నెలకొల్పారు. 26వ వార్డు రామకృష్ణానగర్‌లో శ్రీ సంపత్ సాయి ఉత్సవ సేవా కమిటీ ఆధ్వర్యంలో 30 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 30 ఏళ్ల నుంచి వేడుకలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే అక్కయ్యపాలెం, శంకువానిపాలెం, తాటిచెట్లపాలెం, రైల్వేన్యూ కాలనీ, దొండపర్తి, నరసింహనగర్, కైలాసపురం తదితర ప్రాంతాల్లోనూ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు.

దుర్గా గణపతి ఆలయంలో..

సీతంపేట : స్థానిక దుర్గా గణపతి ఆలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈవో రమాభాయి, కమిటీ ఛైర్మన్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పర్యవేక్షణలో చవితి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం స్వామిని వెండి ఆభరణాలతో అలంకరించారు. గణేశ్ దర్శనానికి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కాగా దుర్గా గణపతి ఆలయంలో స్వామివారు వీణా గణపతి రూపంలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ రమాభాయి, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

మురళీనగర్‌లో...

మురళీనగర్ : జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలో కళింగనగర్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన 24 అడుగుల గణపతి విగ్రహాన్ని తిలకించేందుకు భక్తులు గురువారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో 48ఏ బస్ రూట్‌లో ఏర్పాటు చేసిన మండపం వద్ద ట్రాఫిక్ స్తంభించింది. 49వ వార్డు బర్మాక్యాంపు శ్రీనివాసనగర్‌లో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ రూపంలో ఉన్న విగ్రహం కూడా చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



మర్రిపాలెంలోని శ్రీహర్ష నగర్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం

మహిళలు ఆర్థికంగా ఎదగాలి: ఎంపీ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్, వేదికపై ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, తదితర నాయకులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా ఎదిగి ఉన్నత స్థాయిలో ఉండాలని ఎంపీ ఎం. శ్రీభరత్ ఆకాంక్షించారు. సాలిగ్రామపురంలో సాగరమాల కన్వెన్షన్ హాల్‌లో గురువారం సాయంత్రం నిర్వహించిన 'స్త్రీశక్తి' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు ఏదోక పనిచేసుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధించాలని అన్నారు. సీఎం చంద్రబాబు మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటిలో భాగంగానే తల్లికి వందనం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టి ఇళ్లపై సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశమిచ్చిందన్నారు. తద్వారా ఉచితంగా విద్యుత్ వినియోగించుకోవచ్చన్నారు. జిల్లాలో కేవలం 2600 మంది మాత్రమే దీనికి అంగీకరించారన్నారు. మిగతా వారు కూడా ఈ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడు, జిల్లా కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్ ముక్కా శ్రావణి, తదితర నాయకులు పాల్గొన్నారు.

నగరానికి చేరుకున్న మంత్రి లోకేశ్

... 5వ పేజీ తరువాయి

అధ్యక్షుడు గండి బాబ్జీ, విశాఖ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ తదితర నాయకులు కలిశారు.

నేడు కార్యక్రమాలకు హాజరుకానున్న లోకేశ్

మంత్రి లోకేశ్ శుక్రవారం ఉదయం 11 గంటలకు పీఎం పాలెంలోని వైజాగ్ కన్వెన్షన్‌లో అర్థ సమృద్ధి ఐసీఏఐ నేషనల్ కాన్ఫరెన్స్‌కు హాజరవుతారు. అక్కడ నుంచి 11.30 గంటలకు చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి ఏఐ ల్యాబ్స్‌ను ప్రారంభించి, విద్యార్థులతో మాట్లాడతారు. మధ్యాహ్నం 12.15 గంటలకు చంద్రంపాలెం పాఠశాల నుంచి బయలుదేరి రుషికొండలోని రాడిసిన్ బ్లూ హోటల్‌కు చేరుకుని ఏఐ ల్యాబ్స్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తారు. మధ్యాహ్నం మూడు గంటలకు నోవాటెల్ హోటల్‌కు వెళ్లి ఏరోస్పేస్ మ్యాన్యుఫ్యాక్చరింగ్‌పై సీఐఐ నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సుకు హాజరవుతారు. సాయంత్రం నాలుగు నుంచి 5.30 గంటల వరకు ఏయూ కన్వెన్షన్ హాలులో జరిగే జాతీయ క్రీడా దినోత్సవంలో పాల్గొంటారు. సాయంత్రం ఆరు నుంచి 7.30 గంటల వరకు రాడిసిన్ బ్లూ హోటల్‌లో భారత మహిళా క్రికెట్ జట్టుతో మర్యాదపూర్వకంగా భేటీ కానున్నారు. అనంతరం పార్టీ కార్యాలయానికి చేరుకుని రాత్రికి బస చేస్తారు.

బ్యాంకాక్, మలేషియా, కొలంబో విమానాలు పునరుద్ధరించండి

... 5వ పేజీ తరువాయి

చెప్పారు. ప్రయాణికుల బ్యాగేజీలను స్కాన్ చేసే ఎక్స్‌రే యంత్రాలు నాలుగు ఉండగా వాటిలో రెండు నిత్యం మొరాయిస్తున్నాయని పలువురు ఆరోపించగా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని విమానాశ్రయం అధికారులు హామీ ఇచ్చారు. గోవా, పుణేలకు 85 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్న విమానాలను ఆపేశారని, వాటిని ఎప్పుడు పునరుద్ధరిస్తారని ఎంపీ ప్రశ్నించగా...ప్రయత్నాలు చేస్తున్నామని అధికారులు సమాధానమిచ్చారు. ప్రయాణికులకు తక్కువ ధరకు ఆహార పదార్థాలు అందించడానికి ఉడాన్ యాత్రీ కేఫ్‌ను విశాఖ ఎయిర్‌పోర్టులో కూడా ప్రారంభించాలని ఎంపీ సూచించారు. నేరుగా విదేశాలకు వెళ్లే అంతర్జాతీయ విమానాలపై దృష్టి పెట్టాలన్నారు. బ్యాంకాక్, మలేషియా, కొలంబో విమానాలను పునరుద్ధరించాలన్నారు. వాష్ రూమ్‌ల నిర్వహణ సరిగ్గా ఉండడం లేదని తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని వాటిపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. అదనపు స్లాట్లు కేటాయించాలని నేవీ అధికారులను కోరగా, పైలట్లకు శిక్షణ ఇస్తున్నామని, ప్రస్తుతం కేటాయించలేమని స్పష్టంచేశారు.

శ్రీవాణి-తిరుపతి విమానంపై చర్చ

విశాఖ నుంచి తిరుపతి వెళ్లే విమాన ప్రయాణికులకు శ్రీవాణి టికెట్లు లభించడం లేదని ఇటీవల 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై సమావేశంలో చర్చ జరిగింది. కమిటీ సభ్యులు ఒ.నరేశ్‌కుమార్ మాట్లాడుతూ, ఉదయం 8 గంటలకల్లా తిరుపతికి విమానం వెళ్లేలా సమయాలు మార్చాలని కోరారు. దీనిపై ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, అటు నుంచి విమానాన్ని మధ్యాహ్నం కాకుండా సాయంత్రం వీలైనంత ఆలస్యంగా నడపాలని సూచించారు.

సర్కారు బడుల్లో ఏఐ ల్యాబ్స్

... 5వ పేజీ తరువాయి

50 ఉన్నత పాఠశాలల్లో ఏఐ ల్యాబ్స్ ఏర్పాటుచేస్తోంది. సుమారు నాలుగు కోట్ల వ్యయంతో కంప్యూటర్లు, రోబోటిక్స్, స్మార్ట్ టెక్నాలజీ యంత్రాలు, హైబ్రాడ్‌బాండ్ ఇంటర్‌నెట్ సౌకర్యం, ఒక శిక్షకుడిని సమకూర్చుతున్నారు. 50 పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ, యంత్రాల నిర్వహణ, ఇతరత్రా ఖర్చులకు ఏడాదికి రూ.80 లక్షలు వెచ్చించనున్నారు.

విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏఐ ల్యాబ్స్ ఏర్పాటుచేస్తున్నారు. ఏఐ ల్యాబ్స్ ఏర్పాటుకు మౌలిక వసతులున్న ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా విద్యార్థులు ఉండే చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏఐ ల్యాబ్‌ను మంత్రి శుక్రవారం ప్రారంభిస్తారు.

అనంతరం మిగిలిన పాఠశాలల్లో ఏర్పాటుచేసే ల్యాబ్స్‌ను రాడిసిన్‌బ్లూ హోటల్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఐటీ రంగంలో నూతన ఆవిష్కరణలు అందుబాటులో ఉండేందుకు ఏఐ ల్యాబ్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని సైయంట్ ప్రతినిధి ఒకరు తెలిపారు.

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఐటీలో పట్టు సాధించేందుకు ల్యాబ్స్ ఎంతగానో దోహదడతాయన్నారు.

వినాయక విగ్రహం వద్ద అనధికార వసూళ్లు

... 5వ పేజీ తరువాయి

ప్రవేశ రుసుం వసూలు చేయరాదన్న పోలీసుల ఆదేశాలను నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. దర్శనం, పార్కింగ్, ఫొటోలు తీసుకునేందుకు, చివరకు అన్నదానం పేరిట కూడా నగదు వసూలు చేస్తున్నారు. బుధవారం వినాయక చవితి పండుగ సందర్భంగావివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా త్వరితంగా గణనాథున్ని దర్శనం చేసుకునేందుకంటూ టికెట్లు విక్రయించారు. వాహనాలకు పార్కింగ్ ఫీజు కూడా వసూలు చేశారు. ప్రతిదానికి టికెట్లు పెట్టడం పట్ల భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ విషయం గాజువాక పోలీసులకు తెలియడంతో వారు అక్కడకు చేరుకుని దర్శన టికెట్ల విక్రయాలను నిలిపివేయించారు. పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

వినాయక విగ్రహం వద్ద ఎటువంటి ఫీజులు వసూలు చేయరాదని, టికెట్లు విక్రయించరాదని హెచ్చరించారు. నిర్వాహకులు హద్దుమీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిబంధనలను పాటిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించాలని సూచించారు.

జనసేనకు యువతే ప్రాణం

... 5వ పేజీ తరువాయి

అంతా కలిసిముందుకు సాగాల్సి ఉందన్నారు. అలయన్స్‌లో ఉన్నా పార్టీని ఎలా బలోపేతం చేయాలనే దానిపై అంతా దృష్టి పెట్టి పనిచేయాలని సూచించారు. నియోజకవర్గ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ఈ సమావేశంతో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, లోకం మాధవి, బొలిశెట్టి శ్రీనివాస్, పార్లమెంటు సభ్యులు బాలశౌరి, ఎమ్మెల్సీ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సౌభాగ్యం కోసమే జనసేన

దేశ సౌభాగ్యం కోసమే జనసేన ఆవిర్భవించిందని, ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేస్తారని ఆ పార్టీ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రకటించారు. 'సేనతో..సేనాని' పేరిట జనసేన విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ గురువారం విశాఖపట్నం వచ్చి బీచ్‌రోడ్డులోని బే వ్యూ హోటల్‌లో లెజిస్లేచర్ సమావేశం నిర్వహించారు. అందులో చర్చించిన విషయాలను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఎమ్మెల్సీ హరిప్రసాద్‌లు సాయంత్రం మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ, స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ జరుగుతున్నదంటూ వైసీపీ దుష్ప్రచారం చేస్తున్నదని, అదంతా అవాస్తవమన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలో ఉన్నంత వరకు అది సాధ్యం కాదన్నారు. స్టీల్ ప్లాంటుపై తొలుత స్పందించింది పవన్‌కల్యాణేనని, ఆయన ఢిల్లీ వెళ్లి అమిత్‌షాతో మాట్లాడి ప్రైవేటీకరణ ఆపించారన్నారు. ఆ తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి స్టీల్‌ప్లాంటుకు రూ.14 వేల కోట్ల ఆర్థిక సాయం ఇప్పించారన్నారు. వైసీపీలా తాము స్టీల్ ప్లాంటు భూముల కోసం ములాఖత్ కాలేదన్నారు. ఆ ప్లాంటు కోసం కేప్టివ్ మైన్స్‌తో పాటు ప్రత్యేకమైన పైపులైన్ కూడా పవన్‌కల్యాణ్ డిమాండ్ చేశారన్నారు.

పవన్ కల్యాణ్ పార్టీని పదిహేనేళ్లుగా నడుపుతున్నారని, ఆయన నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి అంతా ఆయన వెనుక నడుస్తున్నామన్నారు. రిజిస్టర్ పార్టీ నుంచి రికగ్నిషన్ పొందిన పార్టీగా జనసేన మారిందన్నారు. ఒక సీటు కూడా లేని పార్టీ పోటీ చేసిన 21 స్థానాల్లో ప్రతి సీటును గెలుచుకొని 100 శాతం స్ట్రైక్ రేటు సాధించిందన్నారు. ఒకానొక సమయంలో పార్టీని విలీనం చేయాలని చాలామంది ఆయన్ను కోరారని, కానీ ఆయన ఆ దిశగా ఏనాడూ ఆలోచన చేయలేదన్నారు. రాష్ట్రం విడిపోయిన తరువాత నిలదొక్కుకోలేకపోతున్నదని బాధ పడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం పవన్ కల్యాణ్ కూటమికి మద్దతు ఇచ్చారన్నారు. అది నిరంతరం కొనసాగుతుందని స్పష్టంచేశారు. గతంలో పవన్ కల్యాణ్ విశాఖపట్నం వస్తే వైసీపీ పార్టీ నాయకులు అనేక అడ్డంకులు సృష్టించారని, నోవాటెల్‌లో నుంచి బయటకు రాకుండా ఆంక్షలు పెట్టారన్నారు. అదే విశాఖపట్నంలో ఇప్పుడు పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నామని, ఇక్కడ మీటింగ్ పెట్టిన ప్రతిసారి రాష్ట్రానికి మేలు జరుగుతున్నదని సుందరపు పేర్కొన్నారు. పార్టీని బలోపేతం చేసే దిశగా నాయకులు, కార్యకర్తలకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేస్తున్నారన్నారు. ఈ రాష్ట్ర అభివృద్ధికి దిశ, దశ సూచించేలా ఈ సమావేశాలు ఉంటాయన్నారు.

భయం గుప్పిట...

... 5వ పేజీ తరువాయి

గోపాలపట్నం, పెందుర్తి, గాజువాక, మల్కాపురం తదితర ప్రాంతాల్లో కొండవాలులో వేలాది మంది నివాసాలు ఏర్పరుచుకుని జీవనం సాగిస్తున్నారు. భారీవర్షాలు కురిసిన ప్రతిసారీ ఎక్కడోఒకచోట కొండచరియలు విరిగిపడడం, మట్టిపెళ్లలు జారిపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సుమారు తొమ్మిదేళ్ల కిందట భారీవర్షం కారణంగా కైలాసపురంలో రాత్రివేళ కొండచరియ విరిగి దిగువనున్న ఇంటిపై పడడంతో ముగ్గురు మృతి చెందారు. వెంకోజీపాలెం మెడికవర్ ఆస్పత్రి వద్ద వర్షానికి ఎత్తున ఉన్న మట్టి జారి దిగువన ఉన్న పూరిళ్లపై పడడంతో ఒకరు మృతిచెందారు. గత ఏడాది గోపాలపట్నం లక్ష్మీనగర్ వద్ద కొండవాలులో మట్టిజారిపోవడంతో ఐదు ఇళ్లు ప్రమాదానికి గురయ్యాయి.

భారీ వర్షాలతో ఆందోళన

తాజాగా అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురిశాయి. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొండవాలు ప్రాంతాలన్నీ ఇప్పటికే నానిపోయి ఉండడంతో ఎలాంటి ఉపద్రవం ముంచుకొస్తుందోనని అధికారులతో పాటు కొండవాలు నివాసితులు ఆందోళన చెందుతున్నారు. కొండవాలు ప్రాంతాల్లో ప్రమాదాలను నియంత్రించేందుకు వీలుగా రక్షణ గోడల నిర్మాణం, ప్రమాదంలో ఉన్న భవనాలను తొలగించడానికి జీవీఎంసీ, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా గత ఏడాది సర్వే నిర్వహించారు.

కొండవాలులో 14,431 కుటుంబాలు

నగరంలోని పలుప్రాంతాల్లోని కొండవాలు ప్రాంతాల్లో నివాసాలు, ప్రమాదం ముంగిట ఉన్న ప్రాంతాలపై జీవీఎంసీ, రెవెన్యూశాఖ అధికారులు ఈనెల రెండున ఒక సర్వే నిర్వహించారు. కొండవాలులో 135 కాలనీలు ఉన్నాయని, అందులో 14,431 కుటుంబాలు నివసిస్తున్నట్టు గుర్తించారు. కొండవాలు ప్రాంతాల్లో అనకాపల్లి జోన్‌లోని ఇందిరమ్మకాలనీ, బీసీ కాలనీ-1, బీసీ కాలనీ-2, పాస్టర్ కాలనీతోపాటు జోన్-2 పరిధిలోని హనుమంతవాక కాలనీలు ప్రమాదం ముంగిట ఉన్నట్టు గుర్తించారు. ఈ ఐదు కాలనీల్లో 249 కుటుంబాలు నివసిస్తున్నాయని, వారిని ప్రత్యామ్నాయ ప్రాంతాలకు తరలించడం వల్ల భవిష్యత్తులో ప్రాణనష్టాన్ని నివారించవచ్చునని అభిప్రాయపడ్డారు. కొండవాలులో ఉన్న కాలనీల్లో మధ్యస్థ ప్రమాదం ముంగిట మరో 89 కాలనీలు ఉన్నట్టు గుర్తించారు.

పురాతన భవనాలపై చర్యలేవీ?

మరోవైపు నగరంలో పురాతన భవనాలను గుర్తించే పనిలో జీవీఎంసీ అధికారులు నిమగ్నమయ్యారు. జోన్లు వారీగా జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో వార్డు ప్లానింగ్ సెక్రటరీలతో పురాతన భవనాలను గుర్తించే ప్రక్రియ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నగరంలో సుమారు 400 పురాతన భవనాలు ఉన్నాయని గుర్తించినట్టు తెలిసింది. ఎక్కువగా పాతనగరంలో 90 భవనాలు పురాతనమైనవిగా గుర్తించారు. భీమిలి జోన్‌లో 15, జోన్-2 పరిధిలో 50, జోన్-3 పరిధిలో 30, జోన్-5 పరిధిలో 50 వరకు గుర్తించారు. పురాతన భవనాలుగా నిర్ధారించాలంటే ఆంధ్ర విశ్వవిద్యాలయం స్ట్రక్చరల్ ఇంజనీర్లు భవనాన్ని సందర్శించి సిమెంట్, కాంక్రీట్, ఐరన్ పటిష్ఠత నిర్ధారించేందుకు శాంపిళ్లు తీసి, ల్యాబ్‌లో పరీక్షిస్తారు. ఇందుకు సుమారు రూ.లక్ష వరకు ఖర్చవగా, పురాతన భవనమని నిర్ధారణ అయితే దానిని కూల్చివేయడం, డెబ్రిస్‌ను తరలించడానికి మరో రూ.రెండు, మూడు లక్షల వరకు ఖర్చవుతుంది. దీంతో అంత మొత్తం ఖర్చు పెట్టలేక అధికారులు మొక్కుబడిగా నివాసితులకు నోటీసు ఇచ్చి వదిలేస్తున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు సర్వేతో సరిపెట్టకుండా కొండవాలు, పురాతనభవనాలపై శాశ్వత చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

భావి ఉపాధ్యాయుల ఆనంద హేల

... 5వ పేజీ తరువాయి

అందుబాటులో ఉంది. ధ్రువపత్రాలపై గెజిటెడ్ అధికారి సంతకం అవసరమనుకుంటే అక్కడ విధులు నిర్వహించి హైస్కూల్ హెచ్‌ఎంలు సంతకం చేశారు.

ఉదయం పది గంటల నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభించారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో ఒకేసారి పరిశీలన ప్రారంభం కావడంతో సర్వర్‌పై కొంత ఒత్తిడి పెరిగింది. దీంతో ఒక్కొక్క అభ్యర్థి ధ్రువపత్రాల పరిశీలనకు 15 నుంచి 20 నిమిషాల సమయం పట్టింది. మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరుగుతున్నప్పుడు పరీక్షలకు దరఖాస్తు చేసిన సమయంలో సమర్పించిన ధ్రువపత్రాలతో సరిపోల్చిన తరువాత వెరిఫికేషన్ అధికారి సెల్‌కు ఓటీపీ వస్తుంది. అక్కడితే పరిశీలన ప్రక్రియ పూర్తయినట్టుగా ప్రకటిస్తున్నారు. కొందరు మహిళా అభ్యర్థులు భర్త కులధ్రువీకరణ పత్రం తీసుకురాగా తిరస్కరించారు. తండ్రి కుల ధ్రువీకరణ పత్రం ప్రామాణికంగా తీసుకోవాల్సి ఉన్నందున సర్టిఫికెట్ తీసుకురావడానికి సమయం ఇస్తున్నారు. కాగా ధ్రువపత్రాల పరిశీలనకు జిల్లా పరిశీలకుడిగా నియమితులైన కేజీబీవీ విద్యాలయాల సెక్రటరీ దేవానందరెడ్డి మొత్తం ప్రక్రియను పర్యవేక్షించారు. అవసరమైన సూచనలు చేశారు. పాఠశాల విద్యా శాఖ విశాఖ ప్రాంతీయ సంచాలకుడు విజయభాస్కర్ నేతృత్వంలో విశాఖ డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ ధ్రువపత్రాల పరిశీలన చూస్తున్నారు. జిల్లాలో ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఇతర సిబ్బంది ధ్రువపత్రాల పరిశీలన విధులు నిర్వహించారు. అయితే సర్వర్ నెమ్మదిగా పనిచేయడంతో ధ్రువపత్రాల పరిశీలన గురువారం రాత్రి వరకూ కొనసాగింది.

ఉప ముఖ్యమంత్రికి మేయర్ పీలా, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ స్వాగతం



పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న మేయర్ పీలీ, సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ

వెంకోజీపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : 'సేనతో సేనాని' బహిరంగ సభకు విశాఖ నగరానికి విచ్చేసిన ఏపీ ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా విశాఖ విమానాశ్రయంలో నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. విశాఖలో ఈ బహిరంగ సభ నిర్వహించడం ఆనందంగా ఉందని ఉప ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు.

స్టీల్‌ప్లాంటు బీఎఫ్ విభాగంలో చోరీపై ఫిర్యాదు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటు బ్లాస్ట్‌ఫర్నేస్-3 విభాగంలోని పాత కాపర్ ప్లేట్లు చోరీకి గురయ్యాయని పేర్కొంటూ విభాగం అధి కారి గురువారం ప్లాంటు క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ప్లాంట్ బీఎఫ్ విభాగంలో జూన్ నెలలో తొలగించిన 45 స్క్రాప్ కాపర్ ప్లేట్లను స్టోర్సులో భద్రపరిచారు. అయితే ఈ నెల 22న అధికారులు స్టోర్సులో పరిశీలించగా ఆరు కాపర్ ప్లేట్లు కనిపించలేదు. జూన్ 12 నుంచి ఈ నెల 22 మధ్యలో చోరీ జరిగి ఉంటుందని, ఈ ప్లేట్ల విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో అధికారి పేర్కొన్నారు.

నగర మేయర్‌ను కలిసిన ట్రైనీ ఐఏఎస్ సాహిత్

వెంకోజీపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావును అల్లూరి సీతారామరాజు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ కె.చిరంజీవి నాగవెంకటసాహిత్ జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 2024 బ్యాచ్‌కు చెందిన ప్రొబేషనర్ అధికారి జీవీఎంసీ అభివృద్ధి కార్యక్రమాలపై ట్రైనీ ఐఏఎస్ అధికారిగా ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు నగరంలోని పలు ప్రాజెక్టులను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్‌ను ట్రైనీ ఐఏఎస్ కలిశారు. అనంతరం నగర మేయర్ పీలా మాట్లాడుతూ విశాఖ నగర ప్రజలు ఎంతో సౌమ్యులని, ఇక్కడ పని చేసే అధికారులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. అలాగే ఇంకా మురికివాడలు, పాత నగరం, జీవీఎంసీ కొత్తగా చేపడుతున్న ప్రాజెక్టులు తదితర వాటిని కూడా పరిశీలించాలని మేయర్ ట్రైనీ కలెక్టర్‌ను సూచించారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బటర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 36, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 30, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 40, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె) 10, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 74, బరబాటి 28, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 74, కీరదోస 30, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	108
లైవ్ ధర	128
విత్ స్కిన్	226
స్కిన్‌లెస్	236



సిరిపురం : చవితి ఉత్సవాల్లో పాల్గొన్న వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్



ఆరిలోవ : చినగదిలిలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో 25 అడుగుల వినాయక విగ్రహం



ఎంవీపీ కాలనీ : ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

చవితి సందడి

- ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు
- మండపాల్లో భక్తి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వినాయక నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఎటు చూసినా వినాయక చవితి సందడి కనిపిస్తోంది. ఒక్కో చోట ఒక్కో రూపంలో వినాయకుడి విగ్రహాలు ఏర్పాటుచేయడంతో చూసేందుకు భక్తులు క్యూ కడుతున్నారు. ఎంవీపీ కాలనీ అయిదో సెక్టరు రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక పూజలకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, సతీమణి సుజన, కుమారుడు ప్రతాప్‌రుద్రతో హాజరయ్యారు. శివాలయంలో శ్రీసిద్ధి వినాయక పార్వతీ ముక్తేశ్వర సాయిరాం భక్త మండలి సభ్యులు నిర్వహించిన భక్తి గానం ఆహూతులను అలరించింది. భావరాజు వీరభద్రమ్మ ఆధ్వర్యంలో సంగీత కచేరి నిర్వహించారు. ఎంవీపీ కాలనీ టీటీడీ సర్కిల్ వద్ద విశాఖ రియల్ ఎస్టేట్ సభ్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉత్సవాలలో వీఎమ్మార్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అయిదో సెక్టరులోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చవితి పందిరిలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతు బజార్‌లో ఎస్టేట్ అధికారి వరహాలు ఆధ్వర్యంలో రైతులు చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వాడవాడలా వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ సంఘాలు, యువకులు వీధివీధినా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. పాత వెంకోజీపాలెంలోని శ్రీసీతారామ యూత్ ఆధ్వర్యంలో 11 అడుగుల శివుడి ఆకారంలో ఏర్పాటు చేసిన వినాయక మట్టి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పూజా కార్యక్రమాల్లో శ్రీ సీతారామ సేవా సంఘం అధ్యక్షుడు కర్రి వెంకట సూరి అప్పారావు, ఇతర కార్యవర్గ సభ్యులు, యూత్ సభ్యులు, మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు. పాత వెంకోజీపాలెం శ్రీశెట్టి బలిజ సేవా సంఘం, శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం కొత్త వెంకోజీపాలెంలోని ఆటోస్టాండ్ గ్రామ సేవా సంఘం, ఎలియాన్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు భారీ ఎత్తున జరిపారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను కొనసాగించనున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.

గ్రేటర్ పరిధిలోని 15, 16 వార్డుల్లో ఎటుచూసినా తండ్రి శివుడి రూపంలోనే తనయుడు విఘ్నేశ్వరుడు విగ్రహాలు ఈ ఏడాది దర్శనమిచ్చాయి. అందరూ అనుకుని ఏర్పాటు చేసినట్టుగా ఒకే రూపంలో చిన్నా, పెద్ద విగ్రహాలను ప్రతిష్ఠించారు. పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా రూపంలోనే కాదు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయడంలోనూ అందరూ ఒకే బాట పట్టారు. ఈ విగ్రహాలను దర్శించుకున్న భక్తులకు ఆశ్చర్యాన్ని నిర్వాహకులు కలిగించారు. ఎక్కడకు వెళ్లిన ఒకే తరహా విగ్రహాన్ని, సైజులు మాత్రం తేడాలో దర్శించుకున్నట్టు ఉందని భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఒకే రకమైన విగ్రహాలతో పాటు కనువిందు కలిగించేలా స్టేజ్‌లను కూడా రూపుదిద్దడం పట్ల భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : చినగదిలిలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 25 అడుగుల వినాయక విగ్రహం ఈ ప్రాంతానికే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ విగ్రహాన్ని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. అలాగే శ్రీకాంత్‌నగర్‌లో హనుమంతుని రూపంలో వినాయక విగ్రహం ఆకట్టుకుంటోంది.

జీవీఎంసీ 11వ వార్డుకు చెందిన క్యాటరింగ్ రాజు వినాయక మండపాలకు వేలం లడ్డూలను ఉచితంగా అందించారు. ఓం సాయిరాం కేటరింగ్ అధినేత కాకి గంగరాజు చిన్న మండపాలకు మూడు కిలోల లడ్డూ, మధ్యస్థ మండపాలకు ఐదు కిలోల లడ్డూ, పెద్ద మండపాలకు ఎనిమిది కిలలోల లడ్డూలను మండపాల నిర్వాహకులకు అందించారు. ఇది తన చిరు కానుక అని ఆయన పేర్కొన్నారు. నిర్వాహకులు రాజుని అభినందించారు.



కృష్ణా కళాశాల రోడ్డులోని అలియన్స్ కళాశాల వద్ద..

పూజల్లో పాల్గొన్న వీఎంఆర్డీఏ చైర్మన్

సిరిపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితిని పురస్కరించుకొని పలు ప్రాంతాల్లో నిర్వహించిన చవితి ఉత్సవాల్లో వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి సంపత్ వినాయకుని ఆలయంలో స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఎంవీపీ కాలనీలోని టీటీడీ కూడలి వద్ద విశాఖ రియల్ ఎస్టేట్ సభ్యుల సంక్షేమ సంఘం నిర్వహించిన చవితి ఉత్సవంలో పాల్గొనగా సంఘం అధ్యక్షుడు నరసింహారావు నేతృత్వంలోని ఆయనను సత్కరించారు. తదుపరి భీమిలిలోని గీతం కాలేజీ విద్యార్థులు నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొన్నారు. తదుపరి దక్షిణ నియోజకవర్గంలోని యువత నిర్వహించిన ఉత్సవం, మద్దిలపాలెం రామాలయం వద్ద ఉత్సవంలోని పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరిహారం అందజేత



ఫిషింగ్ హార్బర్ వద్ద వెల్డింగ్ షాపులోజరిగిన పేలుడు ప్రమాదంలో మృతి చెందిన సన్యాసిరావు కుటుంబానికి పరిహారం చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, తహసీల్దార్ పాల్‌కిరణ్

ఆరిలోవ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) :నగరంలో గల ఫిషింగ్ హార్బర్ వద్ద వెల్డింగ్ షాపులో ఇటీవల జరిగిన పేలుడు ప్రమాదంలో మృతి చెందిన 12వ వార్డు పరిధిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన తాండ్రంగి సన్యాసిరావు (40) భార్య సంతోషికి పరిహారం కింద ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల పరిహారం చెక్‌ను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, చినగదిలి తహసిల్దార పాల్ కిరణ్ గురువారం మృతుడి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ.. మృతి చెందిన సన్యాసిరావు టీడీపీ సభ్యత్వం తీసుకున్నందున పార్టీ ద్వారా అమలు చేసిన బీమా పరిహారం రూ.ఐదు లక్షలు కూడా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, టీడీపీ 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి పోలారావు, కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు, స్థానిక నేతలు గోపల్లి రామకృష్ణ, బసవ దేవుళ్లు, స్థానిక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీతో నిరుద్యోగులకు అండగా ప్రభుత్వం

- వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్

సిరిపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చినమాటనిలబెట్టుకొని అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి తొలి సంతకం పెట్టడమే కాకుండా మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించి వారాల వ్యవధిలో ఫలితాలు ప్రకటించడం చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ పరీక్ష ద్వారా ఒకేసారి 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారని తెలిపారు. ఇది కేవలం ఉద్యోగాల భర్తీ మాత్రమే కాదని, వేలాది కుటుంబాల భవిష్యత్ నిర్మాణమని పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి రాగానే లూలుమాల్‌ను విశాఖకు తీసుకురావడం జరిగిందని, విశాఖ కేంద్రంగా రతన్‌టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభమైందన్నారు. విశాఖలో ఐటీ కార్యకలాపాలను విస్తరించాలనే ఉద్దేశంతో కాగ్నిజెంట్ సంస్థ ముందుకొచ్చిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో మెట్రో ప్రాజెక్టును గాలికి వదిలేస్తే, కూటమి అధికారంలోకి రాగానే మెట్రో ప్రాజెక్టుపై కూడా ప్రణాళికలు రూపొందించిందని, అతి త్వరలోనే మెట్రో పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు.

పార్టీ కోసం పని చేసే వారికే కమిటీల్లో ప్రాధాన్యం : ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం పని చేసే వారికి ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని, అలాంటి వారికే వివిధ స్థాయిల్లో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణబాబు మాట్లాడుతూ కొద్ది రోజుల్లో వార్డు స్థాయి కమిటీల ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రణాళిక ప్రకారం ఆయా తేదీల్లో వార్డు స్థాయి కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసుకుని, ఆమోద యోగ్యమైన నాయకులను కమిటీల్లో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చోడె పట్టాభిరామ్, ఒమ్మి సన్యాసిరావు, జీవీఎంసి కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, కార్యదర్శులు, క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

డీశాలినేషన్ ప్లాంటు నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

వెంకోజీపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : డీశాలినేషన్ ప్లాంటు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. విశాఖ పరిధిలోని అప్పికొండ ప్రాంతంలో నిర్మించనున్న 100 ఎంఎల్‌డీ డిసాలినేషన్ ప్లాంట్ నిర్మాణంపై గురువారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ పల్లమరాజు, తాగునీటి విభాగం పర్యవేక్షక ఇంజనీరు కేవీఎన్ రవి, పర్యవేక్షక ఇంజనీర్ ఏడుకొండలు, ఇతర అధికారులు, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఏపీయూఐఏఎంఎల్) ఇజ్రాయెల్‌కు చెందిన ఐడీఈ టెక్నాలజీస్ లిమిటెడ్ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రాథమిక అంచనాల ప్రకారం ప్లాంటు నిర్మాణానికి రూ.1200 కోట్లు ఖర్చు అవుతుందని, ప్లాంట్ నిర్మాణ పనులు చేపట్టాలంటే ప్రస్తుతం ప్లాంట్ కోసం మౌలిక వసతులు, సామగ్రి నిల్వ సదుపాయాలు, అంతర్గత రహదారుల ఏర్పాటు తదితర వాటి కోసం సుమారు 25 ఎకరాల భూమి అవసరం అవుతుందన్నారు. దీన్ని పబ్లిక్-ప్రైవేటు పార్ట్నర్‌షిప్ (పీపీపీ) కింద ఏర్పాటుకు నిర్ణయించినట్టు వెల్లడించారు. ప్రైవేటు సంస్థలు ఆర్థిక పెట్టుబడి పెడతాయని జీవీఎంసీ భూమి కేటాయింపు, ప్రాజెక్టు అమలుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని కమిషనర్ తెలిపారు. ఇప్పటికే అనుభవం ఉన్న ఐడీఈ టెక్నాలజీస్ ముంబైలో 400 ఎంఎల్‌డీ, తమిళనాడులో 60 ఎంఎల్‌డీ డీశాలినేషన్ ప్లాంట్లు అభివృద్ధి చేసిందని, అలాగే ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు ఐడీఈ టెక్నాలజీస్ లిమిటెడ్ సాంకేతిక భాగస్వామిగా వ్యవహరిస్తుందని కమిషనర్ తెలిపారు.

ఎండాడలో ఏఐ ల్యాబ్

- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న విద్యాశాఖా మంత్రి లోకేశ్

ఎండాడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైయెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ల్యాబ్‌ను రాష్ట్ర విద్య, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. సైబల్స్ పేరుతో ఏర్పాటుచేసిన ల్యాబ్‌లో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పాఠ్యాంశాలు బోధించడంతో పాటు మంచి వాతావరణంలో ప్రయోగాలు చేయడానికి వీలుగా ఏర్పాట్లు చేశారు. స్టెమ్‌రోబో సహకారం అందించనుంది. విద్యార్థులకు ఏఐ సంబంధిత ప్రాజెక్టులు, పరిశోధన, ప్రయోగాలు చేయడానికి ఉపయోగకరంగా రూపొందించారు వాస్తవ ప్రపంచ సమస్యలకు సైద్ధాంతిక విజ్ఞానాన్ని విద్యార్థులకు వివరించేలా ల్యాబ్‌ను తీర్చిదిద్దారు. పాఠశాల విద్యలోనే ఏఐపై అవగాహన, జ్ఞానం అవసరమని గుర్తించిన ప్రభుత్వం ఈ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

సంపత్ వినాయగర్ ఆలయంలో ఘనంగా నవరాత్రి చవితి మహోత్సవాలు

- తెల్లవారుజామున 4 గంటల నుంచే భక్తులకు స్వామివారి దర్శనం
- తొలి రోజు దర్శించుకున్న రాష్ట్ర హోంమంత్రి, పలువురు ఎమ్మెల్యేలు
- రెండో రోజు శ్రీబాలగణపతిగా స్వామివారు దర్శనం



పూజలు అందుకుంటున్న స్వామివారు

సిరిపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ శ్రీసంపత్ వినాయగర్ దేవాలయంలోని వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం తెల్లవారుజాము ఉదయం 4 గంటలకు సంపత్ వినాయగర్ అలంకరణలోని స్వామివారికి భక్తులకు దర్శనమిచ్చారు. తదుపరి గణపతి హోమం, నాదస్వర కచేరి, ఉభయదాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రసాదవితరణ చేపట్టారు.సాయంత్రం 4 గంటల నుంచి నాదస్వర కచేరీ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగంలోని భాగంగా శ్రీగణేష్ పురాణంపై కందుకూరి వేంకట సత్యబాల సుబ్రహ్మణ్యశర్మ.. ప్రవచనం వినిపించారు. తొలి రోజు స్వామివారిని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యేలు రమేష్‌బాబు, గణబాబు, నేవీ చీఫ్ అడ్మిరల్ ఇతర ప్రముఖులు దర్శించుకున్నట్టు ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు తెలియజేశారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు సుమారు 30 వేల మందికి వరకు భక్తులకు దర్శించుకున్నారని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను ఆలయ ఈవో, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్, సిబ్బంది జి. గోవిందరెడ్డి పర్యవేక్షించారు.

రెండో రోజు బాలగణపతిగా దర్శనం..

సంపత్‌వినాయగర్‌ఆలయంలో స్వామివారు గురువారం బాలగణపతి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో సుమారు 1800 మందికి వరకు నారాయణ సేవ చేపట్టినట్టు ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు తెలియజేశారు.ఉదయం సౌందర్యలహరి బృందం, పి.వేంకటరత్నంతో శివపార్వతీ కల్యాణ గానామృతం, శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్టు మహిళా బృందం కోలాటం, నృత్యభారతి అకాడమీ వి.మోనిక పట్నాయక్ కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు.

అలరించిన ఖడ్గతిక్కన పద్య నాటకం

మద్దిలపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన శ్రీఖడ్గ తిక్కన పద్యనాటకం ఆద్యంతం రక్తి కట్టించింది. విజయవాడకు చెందిన శ్రీసాయి బాబా నాట్యమండలి నిర్వహణలో పీవీఎస్ కృష్ణ దర్శకత్వం వహించగా 38 మంది నటనటీమణులు అద్భుత ప్రదర్శనలతో కళాభిమానులను మంత్రముగ్దులను చేశారు. ఆవు జున్ను వల్ల రాజుల మధ్య యుద్ధం ఎలా ప్రారంభమైంది, యుద్ధంలో పన్నిన కుతంత్రాలాతో వాటిల్లిన నష్టం వివరిస్తూ సాగిన శ్రీఖడ్గ తిక్కన పద్యనాటకం అందర్నీ ఆలోచింపజేసింది. రాజుల వేషధారణలతో ఆలపించిన పద్యాలు, ప్రదర్శనలకు ఆడిటోరియం ప్రేక్షకుల కరతాలధ్వనులతో మారుమోగింది. ముందుగా కళాభారతి కార్యదర్శి మాట్లాడుతూ ఆరు రోజుల పాటు నిర్వహించిన తమ జాతీయ పురస్కార ఉత్సవాలకు విశేష స్పందన లభించిందన్నారు. కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు, ఫైడా కృష్ణ ప్రసాద్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ఆశ వర్కర్ల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ వర్కర్లు

సిరిపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆశ వర్కర్లు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ విశాఖ జిల్లా ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ముందుగా ఆశ వర్కర్స్ జీవీఎంసీ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆశా వర్కర్స్‌కు కనీస వేతనాలు చెల్లిస్తామని పేర్కొన్నదని తెలిపారు. ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో పని భారం, యాప్ భారం పెరిగిన నేపథ్యంలో వేతనాలు పెంచాల్సిన అవసరం చాలా ఉందన్నారు. ప్రభుత్వం ఆశ వర్కర్ల పనిని, ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి వేతనాలను తక్షణమే పెంచాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.పద్మ, వి.మేరీ, కోశాధికారి వై.సీతారత్నం, దయానా, జయలక్ష్మి, లీలావతి, వరలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

దేవుడి పేరిట వసూళ్లకు పాల్పడే వారిపై చర్యలు చేపట్టాలి

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాక, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భక్తి పేరిట భారీ గణనాథుని విగ్రహాలను ప్రతిష్ఠించి క్యూ లైన్లు, పార్కింగ్, షాపులు, అన్నదానం పేరిట ప్రజల ఉంచి నగదు వసూలు చేయడం భావ్యం కాదని, అటువంటి వారిపై అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవుడి సేవ పేరుతో వ్యాపారాలు చేసి ప్రయోజనం పొందాలనుకోవడం గౌరవప్రదమైన చర్య కాదన్నారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ బొండా జగన్, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, మొల్లి పెంటిరాజు, సాలాపు రామారావు, ఉరుకూటి అప్పలరాజు, అఫీజా, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలపడమే లక్ష్యం

» ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు

కంచరపాలెం,ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పరంగా ఉత్తర నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలపడానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. 47వ వార్డు సురేశ్‌రామ్ నగర్‌లో రూ.1.24 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అధిక భాగం కొండలపై ఉందన్నారు. ఈ నేపథ్యంలో కొండవాలు గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పనకు పెద్దపీట వేస్తూ పనులు చేపడుతున్నామన్నారు. ఈ పనుల్లో భాగంగా రిటర్నింగ్ గోడలు, కాలువలు, డ్రైన్లు, సామాజిక భవనాలు, రోడ్ల నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. పేదలకు మౌలిక వసతులను చేరవేయడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కుంటిపాము కామేశ్వరీ, స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ


రికార్డులు పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

సీతంపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నగర సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించి, కేసులు త్వరగా పరిష్కరించాలని సూచించారు. స్టేషన్ ఆవరణలో చెట్లు, వాహనాలు అడ్డదిడ్డంగా ఉన్నాయని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అలాగే జనరేటర్ స్థలాన్ని పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. స్టేషన్ పరిసరాలు శుభ్రంగా ఉండేటట్టు చర్యలు చేపట్టాలన్నారు.

రూ.25 లక్షల విలువగల సెల్‌ఫోన్లు రికవరీ

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో, ప్లాట్‌ఫామ్‌లపై చోరీకి గురైన రూ.25 లక్షల విలువగల 100 సెల్‌ఫోన్‌లను రైల్వే పోలీసులు రికవరీ చేసి బాధితులకు గురువారం అందజేశారు. ఈ రికవరీలో ఎస్ఐలు కేటీఆర్.లక్ష్మి, ఎస్.రామారావు, హెడ్ కానిస్టేబుల్ ఉదయ్ భాస్కర్, కానిస్టేబుళ్లు బి.మహేశ్, జి.దుర్గాప్రసాద్, టీజే.వర్మ, రాజేశ్ బృందం దర్యాప్తు చేపట్టి హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, కాకినాడ, రాజమహేంద్రవరం, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాల్లో ఉన్నాయని గుర్తించి బాధితులకు అందజేశారు.

తెలుగు భాషా దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

డాబాగార్డెన్స్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) :వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో జరిగే తెలుగు భాషా దినోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు వేడుకలు ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే గిడుగు రామ్మూర్తి పంతులు పురస్కార గ్రహీతలను ఎంపిక చేశారు. వారికి రూ. 25 వేల నగదు, జ్ఞాపిక అందజేయనున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. అలాగే కమిటీ సభ్యులు బుద్ధ ప్రసాద్, రాష్ట్ర సృజనాత్మక ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి, కమిటీ కన్వీనర్ ఆర్. మల్లికార్జునరావు పాల్గొనున్నారు.

బాలల సంరక్షణ కమిటీ సమావేశం

మహారాణిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కుల పరిరక్షణకు కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో బాలల సంరక్షణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలల విద్య, బాల్య వివాహాల నిషేధం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల హక్కులు తదితర అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో శిశు సంక్షేమ శాఖాధికారి కేవీ రామలక్ష్మి, దిల్సా కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలిక

మహారాణిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి రోజున తప్పిపోయిన నాలుగేళ్ల బాలికను గంటల వ్యవధిలో పోలీసులు ఆమె తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కొబ్బరితోట ప్రాంతానికి చెందిన నీలిమా నక్షత్ర (4) సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. తల్లిదండ్రులు, ఇతర కుటుంబీకులు పండగ సందడిలో పాప సంగతి మరచిపోయారు. గంట తరువాత పాప కోసం వెతకగా ఎక్కడా కనిపించలేదు. దీంతో వారు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ సతీశ్ ఆధ్వర్యంలో సిబ్బంది గాలించారు. రాత్రి 9 గంటల సమయంలో పాప ఇంటికి కొద్ది దూరంలో ఉన్నట్టు గుర్తించి, ఆమెను తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

శ్రమించారు, సాధించారు

... 5వ పేజీ తరువాయి

అనుకున్నది సాధించారు.

చోడవరం మండలం రేవళ్ల గ్రామానికి చెందిన గనివాడ సత్యనారాయణకు ఇద్దరు కుమార్తెలు. ఉపాధ్యాయునిగా పనిచేయాలని సత్యనారాయణ ఆశపడినా కోర్కె నెరవేరలేదు. అయితే తాను చేయాలనుకున్న టీచర్ ఉద్యోగంలో తన ఇద్దరు కుమార్తెలను చూడాలనుకున్న సత్యనారాయణ అదే ఆశయంతో చదివించారు. పెద్దకుమార్తె ఉపాధ్యాయురాలిగా ఎంపికై ప్రస్తుతం పాడేరు సమీపాన ఒక స్కూలులో పనిచేస్తున్నారు. రెండో కుమార్తె సుజాత ఇటీవల నిర్వహించిన డీఎస్సీ (ఎస్జీటీ)లో ఏకంగా జిల్లాస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించి తండ్రి లక్ష్యాన్ని నేరవేర్చారు.

చెప్పలేనంత ఆనందంగా ఉంది

గనివాడ సుజాత, ఎస్జీటీ ప్రథమ ర్యాంకరు

ఎస్జీటీ కేటగిరీలో ప్రథమ ర్యాంకు వచ్చినందుకు చెప్పలేనంత ఆనందంగా ఉంది. తండ్రి ఆశయం కోసం కష్టపడి చదివాను. ఇప్పుడు ఆయన లక్ష్యం, ఆశయం నెరవేరడం సంతోషంగా ఉంది. డీఎస్సీ నిర్వహిస్తామన్న ప్రభుత్వం హామీ నిలబెట్టుకుంది. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే ఆశయంగా పనిచేస్తాను.

అవమానించిన చోట విజయగర్వంతో మరొకరు..

మాడుగుల మండలం జమ్మాదేవిపేటకు చెందిన తాటికొండ ధనలక్ష్మిది పేద కుటుంబం. భర్తకు అర ఎకరా పొలం మాత్రమే ఉంది. వారికి ఇద్దరు పిల్లలు. చదువు పట్ల ధనలక్ష్మిలో ఆసక్తిని గమనించిన భర్త అనేక కష్టాలకు ఓర్చి చదివించారు. ఇద్దరు పిల్లలు కలిగిన తరువాత చదువు ఎందుకు? అంటూ గ్రామంలో అనేకమంది హేళన చేశారు. అన్నింటినీ భరిస్తూ డీఎస్సీకి ప్రిపేరైన ధనలక్ష్మి ఎస్జీటీ కేటగిరీలో జిల్లాలో ఏకంగా రెండో ర్యాంకు సాధించారు. అవమానాలు ఎదుర్కొన్న చోటే..భర్తను తల ఎత్తుకునేలా చేశారు.

మా జీవితాల్లో వెలుగులు నింపింది

తాటికొండ ధనలక్ష్మి, ఎస్జీటీ రెండో ర్యాంకు,

ఎస్జీటీ కేటగిరీలో రెండో ర్యాంకు సాధించడం ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం మా కుటుంబంలో వెలుగులు నింపింది. నాకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. చదువంటే చాలా ఇష్టం. నా ఇష్టాన్ని గురించి నా భర్త చదివించారు. మా గ్రామంలో కొంతమంది నా భర్తను, నన్ను హేళన చేశారు. అయినా వెనకడుగువేయకుండా కష్టపడి చదివాను. విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలిగించేలా బోధన చేస్తాను.


కళింగనగర్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన 24 అడుగుల ప్రతిమ


బర్మా క్యాంప్ శ్రీనివాసనగర్‌లో ఛత్రపతి శివాజీగా...


వీణ గణపతి అలంకరణలో దర్శనమిస్తున్న దుర్గా గణపతి

వీధి వీధినా.. వినాయకుడు

మర్రిపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ వినాయక చవితి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. 53వ వార్డులోని మర్రిపాలెంలో పలు కాలనీల్లో మండపాలు నిర్మించి, ప్రతిమలను ఏర్పాటు చేశారు. శ్రీహర్షనగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ వినాయక ప్రతిమ ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజుల పాటు ఇక్కడ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.


రామకృష్ణానగర్‌లో ఏర్పాటు చేసిన 30 అడుగుల భారీ విగ్రహం

అక్కయ్యపాలెంలో..

అక్కయ్యపాలెం : జీవీఎంసీ 26, 27, 42, 43, 44, 45, 46 వార్డుల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా ప్రాంతాల్లో నిర్వాహకులు వివిధ రూపాల్లో గణపతి విగ్రహాలను నెలకొల్పారు. 26వ వార్డు రామకృష్ణానగర్‌లో శ్రీ సంపత్ సాయి ఉత్సవ సేవా కమిటీ ఆధ్వర్యంలో 30 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 30 ఏళ్ల నుంచి వేడుకలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే అక్కయ్యపాలెం, శంకువానిపాలెం, తాటిచెట్లపాలెం, రైల్వేన్యూ కాలనీ, దొండపర్తి, నరసింహనగర్, కైలాసపురం తదితర ప్రాంతాల్లోనూ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు.

దుర్గా గణపతి ఆలయంలో..

సీతంపేట : స్థానిక దుర్గా గణపతి ఆలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈవో రమాభాయి, కమిటీ ఛైర్మన్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పర్యవేక్షణలో చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం స్వామిని వెండి ఆభరణాలతో అలంకరించారు. గణేశ్ దర్శనానికి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కాగా దుర్గా గణపతి ఆలయంలో స్వామివారు వీణా గణపతి రూపంలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ రమాభాయి, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

మురళీనగర్‌లో...

మురళీనగర్ : జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలో కళింగనగర్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన 24 అడుగుల గణపతి విగ్రహాన్ని తిలకించేందుకు భక్తులు గురువారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో 48ఏ బస్ రూట్‌లో ఏర్పాటు చేసిన మండపం వద్ద ట్రాఫిక్ స్తంభించింది. 49వ వార్డు బర్మాక్యాంపు శ్రీనివాసనగర్‌లో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ రూపంలో ఉన్న విగ్రహం కూడా చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది.


మర్రిపాలెంలోని శ్రీహర్ష నగర్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం

మహిళలు ఆర్థికంగా ఎదగాలి: ఎంపీ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్, వేదికపై ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, తదితర నాయకులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా ఎదిగి ఉన్నత స్థాయిలో ఉండాలని ఎంపీ ఎం. శ్రీభరత్ ఆకాంక్షించారు. సాలిగ్రామపురంలో సాగర మాల కన్వెన్షన్ హాల్‌లో గురువారం సాయంత్రం నిర్వహించిన 'స్త్రీశక్తి' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు ఏదోక పనిచేసుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధించాలని అన్నారు. సీఎం చంద్రబాబు మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటిలో భాగంగానే తల్లికి వందనం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టి ఇళ్లపై సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశమిచ్చిందన్నారు. తద్వారా ఉచితంగా విద్యుత్ వినియోగించుకోవచ్చన్నారు. జిల్లాలో కేవలం 2600 మంది మాత్రమే దీనికి అంగీకరించారన్నారు. మిగతా వారు కూడా ఈ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడు, జిల్లా కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్ ముక్కా శ్రావణి, తదితర నాయకులు పాల్గొన్నారు.

నగరానికి చేరుకున్న మంత్రి లోకేశ్

... 5వ పేజీ తరువాయి

అధ్యక్షుడు గండి బాబ్జీ, విశాఖ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ తదితర నాయకులు కలిశారు.

నేడు కార్యక్రమాలకు హాజరుకానున్న లోకేశ్

మంత్రి లోకేశ్ శుక్రవారం ఉదయం 11 గంటలకు పీఎం పాలెంలోని వైజాగ్ కన్వెన్షన్‌లో అర్థ సమృద్ధి ఐసీఏఐ నేషనల్ కాన్ఫరెన్స్‌కు హాజరవుతారు. అక్కడ నుంచి 11.30 గంటలకు చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి ఏఐ ల్యాబ్స్‌ను ప్రారంభించి, విద్యార్థులతో మాట్లాడతారు. మధ్యాహ్నం 12.15 గంటలకు చంద్రంపాలెం పాఠశాల నుంచి బయలుదేరి రుషికొండలోని రాడిసిన్ బ్లూ హోటల్‌కు చేరుకుని ఏఐ ల్యాబ్స్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తారు. మధ్యాహ్నం మూడు గంటలకు నోవాటెల్ హోటల్‌కు వెళ్లి ఏరోస్పేస్ మ్యాన్యుఫ్యాక్చరింగ్‌పై సీఐఐ నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సుకు హాజరవుతారు. సాయంత్రం నాలుగు నుంచి 5.30 గంటల వరకు ఏయూ కన్వెన్షన్ హాలులో జరిగే జాతీయ క్రీడా దినోత్సవంలో పాల్గొంటారు. సాయంత్రం ఆరు నుంచి 7.30 గంటల వరకు రాడిసిన్ బ్లూ హోటల్‌లో భారత మహిళా క్రికెట్ జట్టుతో మర్యాదపూర్వకంగా భేటీ కానున్నారు. అనంతరం పార్టీ కార్యాలయానికి చేరుకుని రాత్రికి బస చేస్తారు.

బ్యాంకాక్, మలేషియా, కొలంబో విమానాలు పునరుద్ధరించండి

... 5వ పేజీ తరువాయి

చెప్పారు. ప్రయాణికుల బ్యాగేజీలను స్కాన్ చేసే ఎక్స్‌రే యంత్రాలు నాలుగు ఉండగా వాటిలో రెండు నిత్యం మొరాయిస్తున్నాయని పలువురు ఆరోపించగా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని విమానాశ్రయం అధికారులు హామీ ఇచ్చారు. గోవా, పుణేలకు 85 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్న విమానాలను ఆపేశారని, వాటిని ఎప్పుడు పునరుద్ధరిస్తారని ఎంపీ ప్రశ్నించగా...ప్రయత్నాలు చేస్తున్నామని అధికారులు సమాధానమిచ్చారు. ప్రయాణికులకు తక్కువ ధరకు ఆహార పదార్థాలు అందించడానికి ఉడాన్ యాత్రీ కేఫ్‌ను విశాఖ ఎయిర్‌పోర్టులో కూడా ప్రారంభించాలని ఎంపీ సూచించారు. నేరుగా విదేశాలకు వెళ్లే అంతర్జాతీయ విమానాలపై దృష్టి పెట్టాలన్నారు. బ్యాంకాక్, మలేషియా, కొలంబో విమానాలను పునరుద్ధరించాలన్నారు. వాష్ రూమ్‌ల నిర్వహణ సరిగ్గా ఉండడం లేదని తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని వాటిపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. అదనపు స్లాట్లు కేటాయించాలని నేవీ అధికారులను కోరగా, పైలట్లకు శిక్షణ ఇస్తున్నామని, ప్రస్తుతం కేటాయించలేమని స్పష్టంచేశారు.

శ్రీవాణి-తిరుపతి విమానంపై చర్చ

విశాఖ నుంచి తిరుపతి వెళ్లే విమాన ప్రయాణికులకు శ్రీవాణి టికెట్లు లభించడం లేదని ఇటీవల 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై సమావేశంలో చర్చ జరిగింది. కమిటీ సభ్యులు ఒ.నరేశ్‌కుమార్ మాట్లాడుతూ, ఉదయం 8 గంటలకల్లా తిరుపతికి విమానం వెళ్లేలా సమయాలు మార్చాలని కోరారు. దీనిపై ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, అటు నుంచి విమానాన్ని మధ్యాహ్నం కాకుండా సాయంత్రం వీలైనంత ఆలస్యంగా నడపాలని సూచించారు.

సర్కారు బడుల్లో ఏఐ ల్యాబ్స్

... 5వ పేజీ తరువాయి

50 ఉన్నత పాఠశాలల్లో ఏఐ ల్యాబ్స్ ఏర్పాటుచేస్తోంది. సుమారు నాలుగు కోట్ల వ్యయంతో కంప్యూటర్లు, రోబోటిక్స్, స్మార్ట్ టెక్నాలజీ యంత్రాలు, హైబ్రాడ్‌బాండ్ ఇంటర్‌నెట్ సౌకర్యం, ఒక శిక్షణకుడిని సమకూర్చుతున్నారు. 50 పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ, యంత్రాల నిర్వహణ, ఇతరత్రా ఖర్చులకు ఏడాదికి రూ.80 లక్షలు వెచ్చించనున్నారు.

విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏఐ ల్యాబ్స్ ఏర్పాటుచేస్తున్నారు. ఏఐ ల్యాబ్స్ ఏర్పాటుకు మౌలిక వసతులున్న ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా విద్యార్థులు ఉండే చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏఐ ల్యాబ్‌ను మంత్రి శుక్రవారం ప్రారంభిస్తారు.

అనంతరం మిగిలిన పాఠశాలల్లో ఏర్పాటుచేసే ల్యాబ్స్‌ను రాడిసిన్‌బ్లూ హోటల్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఐటీ రంగంలో నూతన ఆవిష్కరణలు అందుబాటులో ఉండేందుకు ఏఐ ల్యాబ్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని సైయంట్ ప్రతినిధి ఒకరు తెలిపారు.

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఐటీలో పట్టు సాధించేందుకు ల్యాబ్స్ ఎంతగానో దోహదడతాయన్నారు.

వినాయక విగ్రహం వద్ద అనధికార వసూళ్లు

... 5వ పేజీ తరువాయి

ప్రవేశ రుసుం వసూలు చేయరాదన్న పోలీసుల ఆదేశాలను నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. దర్శనం, పార్కింగ్, ఫొటోలు తీసుకునేందుకు, చివరకు అన్నదానం పేరిట కూడా నగదు వసూలు చేస్తున్నారు. బుధవారం వినాయక చవితి పండుగ సందర్భంగావివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా త్వరితంగా గణనాథున్ని దర్శనం చేసుకునేందుకంటూ టికెట్లు విక్రయించారు. వాహనాలకు పార్కింగ్ ఫీజు కూడా వసూలు చేశారు. ప్రతిదానికి టికెట్లు పెట్టడం పట్ల భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ విషయం గాజువాక పోలీసులకు తెలియడంతో వారు అక్కడకు చేరుకుని దర్శన టికెట్ల విక్రయాలను నిలిపివేయించారు. పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

వినాయక విగ్రహం వద్ద ఎటువంటి ఫీజులు వసూలు చేయరాదని, టికెట్లు విక్రయించరాదని హెచ్చరించారు. నిర్వాహకులు హద్దుమీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిబంధనలను పాటిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించాలని సూచించారు.

జనసేనకు యువతే ప్రాణం

... 5వ పేజీ తరువాయి

అంతా కలిసిముందుకు సాగాల్సి ఉందన్నారు. అలయన్స్‌లో ఉన్నా పార్టీని ఎలా బలోపేతం చేయాలనే దానిపై అంతా దృష్టి పెట్టి పనిచేయాలని సూచించారు. నియోజకవర్గ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ఈ సమావేశంతో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, లోకం మాధవి, బొలిశెట్టి శ్రీనివాస్, పార్లమెంటు సభ్యులు బాలశౌరి, ఎమ్మెల్సీ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సౌభాగ్యం కోసమే జనసేన

దేశ సౌభాగ్యం కోసమే జనసేన ఆవిర్భవించిందని, ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేస్తారని ఆ పార్టీ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రకటించారు. 'సేనతో..సేనాని' పేరిట జనసేన విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ గురువారం విశాఖపట్నం వచ్చి బీచ్‌రోడ్డులోని బే వ్యూ హోటల్‌లో లెజిస్లేచర్ సమావేశం నిర్వహించారు. అందులో చర్చించిన విషయాలను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఎమ్మెల్సీ హరిప్రసాద్‌లు సాయంత్రం మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ, స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ జరుగుతున్నదంటూ వైసీపీ దుష్ప్రచారం చేస్తున్నదని, అదంతా అవాస్తవమన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలో ఉన్నంత వరకు అది సాధ్యం కాదన్నారు. స్టీల్ ప్లాంటుపై తొలుత స్పందించింది పవన్‌కల్యాణేనని, ఆయన ఢిల్లీ వెళ్లి అమిత్‌షాతో మాట్లాడి ప్రైవేటీకరణ ఆపించారన్నారు. ఆ తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి స్టీల్‌ప్లాంటుకు రూ.14 వేల కోట్ల ఆర్థిక సాయం ఇప్పించారన్నారు. వైసీపీలా తాము స్టీల్ ప్లాంటు భూముల కోసం ములాఖత్ కాలేదన్నారు. ఆ ప్లాంటు కోసం కేప్టివ్ మైన్స్‌తో పాటు ప్రత్యేకమైన పైపులైన్ కూడా పవన్‌కల్యాణ్ డిమాండ్ చేశారన్నారు.

పవన్ కల్యాణ్ పార్టీని పదిహేనేళ్లుగా నడుపుతున్నారని, ఆయన నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి అంతా ఆయన వెనుక నడుస్తున్నామన్నారు. రిజిస్టర్ పార్టీ నుంచి రికగ్నిషన్ పొందిన పార్టీగా జనసేన మారిందన్నారు. ఒక సీటు కూడా లేని పార్టీ పోటీ చేసిన 21 స్థానాల్లో ప్రతి సీటును గెలుచుకొని 100 శాతం స్ట్రైక్ రేటు సాధించిందన్నారు. ఒకానొక సమయంలో పార్టీని విలీనం చేయాలని చాలామంది ఆయన్ను కోరారని, కానీ ఆయన ఆ దిశగా ఏనాడూ ఆలోచన చేయలేదన్నారు. రాష్ట్రం విడిపోయిన తరువాత నిలదొక్కుకోలేకపోతున్నదని బాధ పడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం పవన్ కల్యాణ్ కూటమికి మద్దతు ఇచ్చారన్నారు. అది నిరంతరం కొనసాగుతుందని స్పష్టంచేశారు. గతంలో పవన్ కల్యాణ్ విశాఖపట్నం వస్తే వైసీపీ పార్టీ నాయకులు అనేక అడ్డంకులు సృష్టించారని, నోవాటెల్‌లో నుంచి బయటకు రాకుండా ఆంక్షలు పెట్టారన్నారు. అదే విశాఖపట్నంలో ఇప్పుడు పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నామని, ఇక్కడ మీటింగ్ పెట్టిన ప్రతిసారి రాష్ట్రానికి మేలు జరుగుతున్నదని సుందరపు పేర్కొన్నారు. పార్టీని బలోపేతం చేసే దిశగా నాయకులు, కార్యకర్తలకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేస్తున్నారన్నారు. ఈ రాష్ట్ర అభివృద్ధికి దిశ, దశ సూచించేలా ఈ సమావేశాలు ఉంటాయన్నారు.

భయం గుప్పిట...

... 5వ పేజీ తరువాయి

గోపాలపట్నం, పెందుర్తి, గాజువాక, మల్కాపురం తదితర ప్రాంతాల్లో కొండవాలులో వేలాది మంది నివాసాలు ఏర్పరుచుకుని జీవనం సాగిస్తున్నారు. భారీవర్షాలు కురిసిన ప్రతిసారీ ఎక్కడోఒకచోట కొండచరియలు విరిగిపడడం, మట్టిపెళ్లలు జారిపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సుమారు తొమ్మిదేళ్ల కిందట భారీవర్షం కారణంగా కైలాసపురంలో రాత్రివేళ కొండచరియ విరిగి దిగువనున్న ఇంటిపై పడడంతో ముగ్గురు మృతి చెందారు. వెంకోజీపాలెం మెడికవర్ ఆస్పత్రి వద్ద వర్షానికి ఎత్తున ఉన్న మట్టి జారి దిగువన ఉన్న పూరిళ్లపై పడడంతో ఒకరు మృతిచెందారు. గత ఏడాది గోపాలపట్నం లక్ష్మీనగర్ వద్ద కొండవాలులో మట్టిజారిపోవడంతో ఐదు ఇళ్లు ప్రమాదానికి గురయ్యాయి.

భారీ వర్షాలతో ఆందోళన

తాజాగా అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురిశాయి. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొండవాలు ప్రాంతాలన్నీ ఇప్పటికే నానిపోయి ఉండడంతో ఎలాంటి ఉపద్రవం ముంచుకొస్తుందోనని అధికారులతో పాటు కొండవాలు నివాసితులు ఆందోళన చెందుతున్నారు. కొండవాలు ప్రాంతాల్లో ప్రమాదాలను నియంత్రించేందుకు వీలుగా రక్షణ గోడల నిర్మాణం, ప్రమాదంలో ఉన్న భవనాలను తొలగించడానికి జీవీఎంసీ, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా గత ఏడాది సర్వే నిర్వహించారు.

కొండవాలులో 14,431 కుటుంబాలు

నగరంలోని పలుప్రాంతాల్లోని కొండవాలు ప్రాంతాల్లో నివాసాలు, ప్రమాదం ముంగిట ఉన్న ప్రాంతాలపై జీవీఎంసీ, రెవెన్యూశాఖ అధికారులు ఈనెల రెండున ఒక సర్వే నిర్వహించారు. కొండవాలులో 135 కాలనీలు ఉన్నాయని, అందులో 14,431 కుటుంబాలు నివసిస్తున్నట్టు గుర్తించారు. కొండవాలు ప్రాంతాల్లో అనకాపల్లి జోన్‌లోని ఇందిరమ్మకాలనీ, బీసీ కాలనీ-1, బీసీ కాలనీ-2, పాస్టర్ కాలనీతోపాటు జోన్-2 పరిధిలోని హనుమంతవాక కాలనీలు ప్రమాదం ముంగిట ఉన్నట్టు గుర్తించారు. ఈ ఐదు కాలనీల్లో 249 కుటుంబాలు నివసిస్తున్నాయని, వారిని ప్రత్యామ్నాయ ప్రాంతాలకు తరలించడం వల్ల భవిష్యత్తులో ప్రాణనష్టాన్ని నివారించవచ్చునని అభిప్రాయపడ్డారు. కొండవాలులో ఉన్న కాలనీల్లో మధ్యస్థ ప్రమాదం ముంగిట మరో 89 కాలనీలు ఉన్నట్టు గుర్తించారు.

పురాతన భవనాలపై చర్యలేవీ?

మరోవైపు నగరంలో పురాతన భవనాలను గుర్తించే పనిలో జీవీఎంసీ అధికారులు నిమగ్నమయ్యారు. జోన్ల వారీగా జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో వార్డు ప్లానింగ్ సెక్రటరీలతో పురాతన భవనాలను గుర్తించే ప్రక్రియ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నగరంలో సుమారు 400 పురాతన భవనాలు ఉన్నాయని గుర్తించినట్టు తెలిసింది. ఎక్కువగా పాతనగరంలో 90 భవనాలు పురాతనమైనవిగా గుర్తించారు. భీమిలి జోన్‌లో 15, జోన్-2 పరిధిలో 50, జోన్-3 పరిధిలో 30, జోన్-5 పరిధిలో 50 వరకు గుర్తించారు. పురాతన భవనాలుగా నిర్ధారించాలంటే ఆంధ్ర విశ్వవిద్యాలయం స్ట్రక్చరల్ ఇంజనీర్లు భవనాన్ని సందర్శించి సిమెంట్, కాంక్రీట్, ఐరన్ పటిష్ఠత నిర్ధారించేందుకు శాంపిళ్లు తీసి, ల్యాబ్‌లో పరీక్షిస్తారు. ఇందుకు సుమారు రూ.లక్ష వరకు ఖర్చవగా, పురాతన భవనమని నిర్ధారణ అయితే దానిని కూల్చివేయడం, డెబ్రిస్‌ను తరలించడానికి మరో రూ.రెండు, మూడు లక్షల వరకు ఖర్చవుతుంది. దీంతో అంత మొత్తం ఖర్చు పెట్టలేక అధికారులు మొక్కుబడిగా నివాసితులకు నోటీసు ఇచ్చి వదిలేస్తున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు సర్వేతో సరిపెట్టకుండా కొండవాలు, పురాతనభవనాలపై శాశ్వత చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

భావి ఉపాధ్యాయుల ఆనంద హేల

... 5వ పేజీ తరువాయి

అందుబాటులో ఉంది. ధ్రువపత్రాలపై గెజిటెడ్ అధికారి సంతకం అవసరమనుకుంటే అక్కడ విధులు నిర్వహించి హైస్కూల్ హెచ్‌ఎంలు సంతకం చేశారు.

ఉదయం పది గంటల నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభించారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో ఒకేసారి పరిశీలన ప్రారంభం కావడంతో సర్వర్‌పై కొంత ఒత్తిడి పెరిగింది. దీంతో ఒక్కొక్క అభ్యర్థి ధ్రువపత్రాల పరిశీలనకు 15 నుంచి 20 నిమిషాల సమయం పట్టింది. మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరుగుతున్నప్పుడు పరీక్షలకు దరఖాస్తు చేసిన సమయంలో సమర్పించిన ధ్రువపత్రాలతో సరిపోల్చిన తరువాత వెరిఫికేషన్ అధికారి సెల్‌కు ఓటీపీ వస్తుంది. అక్కడితే పరిశీలన ప్రక్రియ పూర్తయినట్టుగా ప్రకటిస్తున్నారు. కొందరు మహిళా అభ్యర్థులు భర్త కులధ్రువీకరణ పత్రం తీసుకురాగా తిరస్కరించారు. తండ్రి కుల ధ్రువీకరణ పత్రం ప్రామాణికంగా తీసుకోవాల్సి ఉన్నందున సర్టిఫికెట్ తీసుకురావడానికి సమయం ఇస్తున్నారు. కాగా ధ్రువపత్రాల పరిశీలనకు జిల్లా పరిశీలకుడిగా నియమితులైన కేజీబీవీ విద్యాలయాల సెక్రటరీ దేవానందరెడ్డి మొత్తం ప్రక్రియను పర్యవేక్షించారు. అవసరమైన సూచనలు చేశారు. పాఠశాల విద్యా శాఖ విశాఖ ప్రాంతీయ సంచాలకుడు విజయభాస్కర్ నేతృత్వంలో విశాఖ డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ ధ్రువపత్రాల పరిశీలన చూస్తున్నారు. జిల్లాలో ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఇతర సిబ్బంది ధ్రువపత్రాల పరిశీలన విధులు నిర్వహించారు. అయితే సర్వర్ నెమ్మదిగా పనిచేయడంతో ధ్రువపత్రాల పరిశీలన గురువారం రాత్రి వరకూ కొనసాగింది.



జింక్ గేటు సమీపంలో మంటల్లో కారు

పార్కింగ్‌లో ఉన్న కారు దగ్ధం

మల్కాపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జింక్ గేటు సమీపంలోని ప్రధాన రహదారిలో పార్కింగ్‌లో ఉన్న షిఫ్ట్ డిజైనర్ కారు గురువారం ఉదయం దగ్ధమైంది. ఒక్కసారిగా కారు నుంచి మంటలు చెలరేగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పెదగంట్యాడ అగ్నిమాపకశాఖ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

స్టీల్ ప్లాంట్ బీఎఫ్ విభాగంలో చోరీపై ఫిర్యాదు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్-3 విభాగంలోని పాత కాపర్ ప్లేట్లు చోరీకి గురయ్యాయని పేర్కొంటూ విభాగం అధికారి గురువారం ప్లాంట్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ప్లాంట్ బీఎఫ్ విభాగంలో జూన్ నెలలో తొలగించిన 45 స్క్రాప్ కాపర్ ప్లేట్లను స్టోర్సులో భద్రపరిచారు. అయితే ఈ నెల 22న అధికారులు స్టోర్సులో పరిశీలించగా ఆరు కాపర్ ప్లేట్లు కనిపించలేదు. జూన్ 12 నుంచి ఈ నెల 22 మధ్యలో చోరీ జరిగి ఉంటుందని, ఈ ప్లేట్ల విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అధికారి పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెదగంట్యాడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గంగవరం పోర్టుకు సంబంధించిన రైల్వే ట్రాక్‌పై డంపింగ్ యార్డుకు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని న్యూపోర్టు పోలీసులు గురువారం మధ్యాహ్నం కనుగొన్నారు. మృతుడి వయసు సుమారు 43 ఏళ్లు ఉంటాయని, ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'కాలుష్యం నుంచి కాపాడాలి'

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): 68వ వార్డు పరిధిలో గల అక్కిరెడ్డిపాలెం, పంచవటి, మింది కాలనీలను కాలుష్యం నుంచి రక్షించాలని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి సభ్యులకు అఖిలపక్ష కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం నగరంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి సభ్యులతో వార్డు అఖిలపక్ష కమిటీ నాయకులు సమావేశమై కాలుష్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. అక్కిరెడ్డిపాలేనికి ఆనుకుని ఉన్న పోర్టు స్థలంలో టీపీసీఎల్ గొడౌన్ ఏర్పాటుకు తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు స్పష్టం చేయడంతో కమిటీ సభ్యులు ఆనందం వెలిబుచ్చారు. సమావేశంలో కమిటీ సభ్యులు ప్రగడ చిన్నారావు, సర్వసిద్ధి అనంతలక్ష్మి, మురళీకృష్ణ, రామ్మోహన్, కె.పాండ, తదితరులు పాల్గొన్నారు.



జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను ఎయిర్‌పోర్టులో సత్కరించిన బెహరా భాస్కరరావు

సినిమా గైడ్

- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 36, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 30, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 40, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 74, బరబాటి 28, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 74, కీరదోస 30, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	
బ్రాయిలర్	
రైతు ధర	108
లైవ్ ధర	128
విత్ స్కిన్	222
స్కిన్‌లెస్	236



65వ వార్డు అశోక్‌నగర్‌లో పూజలందుకుంటున్న లంబోదరుడు



చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో ఆకట్టుకుంటున్న 20 అడుగుల గణనాథుడు



86వ వార్డు మాతృశ్రీ నగర్‌లో కొలువుదీరిన బొజ్జ గణపయ్య



గాజువాక బీసీ రోడ్డులోని సీతారామనగర్‌లో రాజీవ్ యూత్ ప్రతిష్ఠించిన త్రిశూల గణేశుడు



మల్కాపురం ప్రకాశనగర్‌లో 'పాప్‌కార్న్' గణపతి

ఓం గం గణపతియే నమః

చవితి ఉత్సవాల్లో భాగంగా పలు ప్రాంతాల్లో వివిధ రూపాలలో పూజలందుకుంటున్న గణేశులు

కూర్మన్నపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను బుధవారం ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. చవితి ఉత్సవాల్లో భాగంగా మహా నగరంలోని పలు ప్రాంతాల్లో వివిధ ఆకృతులు, భారీ సైజుల్లో కొలువుదీరిన గణనాథుని ప్రతిమలు చూపరులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ఇందులో భాగంగా 86వ వార్డు పరిధి మాతృశ్రీ నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణేశుని మండపం వద్ద జరిపిన ప్రత్యేక పూజలు, హోమాల్లో టీడీపీ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ, రాజకీయ నాయకుడు దామా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు. యాతపాలెంలో చదుర్భాహు వినాయక మండపంలో చేపట్టిన పూజల్లో వద్ద నల్లూరు సూర్యనారాయణ, టీడీపీ నాయకులు వేగుంట శ్రీనివాస్, కండిపల్లి అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే 87వ వార్డు పరిధి వడ్లపూడి, కణితి, తదితర ప్రాంతాల్లో జరిగిన గణేశుని పూజల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, కె.శ్రీను, పి.దానయ్య, రాజన్‌రాజు, ఎం.రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. 70వ వార్డు ఎల్‌వీ నగర్, డ్రైవర్స్ కాలనీల్లో జరిగిన వినాయకుని పూజల్లో నాయకులు కేవీఎస్ శంకరరావు, లంకల మురళీదేవి, కేవీసూరిబాబు, వి.రాజారావు, పీబీఎల్ మూర్తి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: గాజువాక పరిసరాల్లోని పలు కాలనీలు, అపార్ట్‌మెట్ల నివాసితులు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గాజువాక సింహగిరి కాలనీలో నెమలి పించాల వినాయకుడు, బీసీ రోడ్డులోని సీతారామనగర్‌లో రాజీవ్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన భారీ గణనాథుని విగ్రహాలు చూపరులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ఇదిలావుండగా వినాయక నిమజ్జనాల కోసం అప్పికొండ తీరంలో పోలీసులు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు.

పెందుర్తి: స్థానిక కళాశాల వద్ద ఫ్రెండ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణేశుని విగ్రహంతో పాటు చినముషిడివాడ శ్రమశక్తి నగర్ కాలనీ యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 20 అడుగుల గణనాథుని విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. అలాగే పెందుర్తిలోని బాలాజీ నగర్, ప్రశాంతి నగర్, సూర్యా నగర్ కాలనీల యూత్ ఆధ్వర్యంలోని వినాయక విగ్రహాలు, సరిపల్లిలో ప్రతిష్ఠించిన గణేశుని విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

గోపాలపట్నం: ఇక్కడి ఎల్లపువానిపాలెంలో ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో ఏర్పాటు చేసిన సెట్ అందరికీ అమితంగా ఆకట్టుకుంటుంది. హెలీకాప్టర్ నమూనాలో మండపం, సైనికుడి రూపంలో వినాయకుడు, పైలట్‌గా మూషికాన్ని ఏర్పాటు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి తిలకిస్తున్నారు. అలాగే కొత్తపాలెంలో మిలీనియం ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో కేరళలోని అయ్యప్ప స్వామి ఆలయ నమూనాలో తీర్చిదిద్దిన మండపం, అయ్యప్ప ఆకారంలో గణేశుడు దర్శనమిస్తున్నారు. కాగా 60వ వార్డు జవహర్‌నగర్‌లో శ్రీగణేశ్ పూజ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పూజల్లో ఎమ్మెల్యే పి.గణబాబు, టీడీపీ వార్డు అధ్యక్షుడు మాతా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: చవితి ఉత్సవాల్లో భాగంగా ఇక్కడి ప్రకాశ్‌నగర్‌లో గల అంబేడ్కర్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 15 అడుగుల పాప్‌కార్న్ వినాయకుడు భక్తులను అమితంగా ఆకట్టుకుంటున్నారు. స్థానిక యువకులు ఆర్.ఈశ్వరరావు, చందు, దినేశ్, అచ్యుత్, జశ్వంత్, ముని, తదితరులు తొమ్మిది రోజుల పాటు శ్రమించి ఇరవై కిలోల పాప్‌కార్న్‌తో వినాయకుడిని రూపొందించారు. కాగా ఈ గణేశుని తయారీకి ఆర్.అప్పారావు అనే వ్యక్తి ఆర్థిక సహకారాన్ని అందజేశారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి అశోక్‌నగర్ యూత్ కమిటీ నిర్వాహకులు కాలనీ కమ్యూనిటీ హాల్లో ప్రతిష్ఠించిన భారీ గణేశుడు చూపరులను ఆకట్టుకుంటున్నారు. 75వ వార్డు సీతానగరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వినాయక పూజల్లో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, వెంకటరమణారెడ్డి దంపతులు పాల్గొన్నారు. 76వ వార్డు బీజేఆర్ కాలనీలో యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చవితి ఉత్సవాల్లో టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు పాల్గొని పూజలు చేశారు. పల్లివీధి, నెల్లిముక్కు, ధర్మాలవీధి, దుర్గవానిపాలెం, ముసలినాయుడు పాలెం, గొడ్డువానిపాలెం, చినకోరాడల్లో ప్రతిష్ఠించిన గణేశుని విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి.

అగనంపూడి: పెదమడక సంపత్ వినాయక ఆలయంలో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. స్వామివారికి పంచామృతాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఎం.వెంకటరమణ, మజ్జి శ్రీను, నరసింగరావు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు. కొండయ్యవలస ఆదర్శ హనుమన్ యువజన సేవా సంఘం ప్రతినిధులు ప్రతిష్ఠించిన గరుడ వాహనంపై గణనాథుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలు వినాయక మండపాల్లో జరిగిన పూజల్లో కార్పొరేటర్లు రౌతు శ్రీనివాస్, ఇల్లపు వరలక్ష్మీ ప్రసాద్, టీడీపీ నాయకులు దశేంద్ర, జగదీశ్ పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల శ్రీవేంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానంలో గణనాథునికి పంచామృతాలతో అభిషేకించాక గరిక, పుష్పాలు, కుంకుమలతో అర్చన చేశారు. 69వ వార్డు వెంకటేశ్వర కాలనీలో ప్రతిష్ఠించిన భారీ పంచముఖ వినాయకుడు, తుంగ్లాంలోని అయోధ్య రాముని అవతారంలో వినాయకుడు ప్రజలను ఆకట్టుకున్నారు. పలు చోట్ల చేపట్టిన పూజల్లో కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి పాల్గొన్నారు. 68వ వార్డు పరిధి అక్కిరెడ్డిపాలెం, మింది, రామ్‌నగర్ కాలనీల్లో నెలకొల్పిన గణేశుని మండపాల్లో జరిగిన పూజల్లో కార్పొరేటర్ గుడివాడ అనూష, గుడివాడ లతీశ్, సంగ్రాన నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: గ్రేటర్ గోశాల సమీపంలోని ఎస్ఎన్ఆర్ కల్యాణ మండపం వద్ద బాలాజీనగర్ ఫ్రెండ్లీ గయ్స్ ఆధ్వర్యంలో చేపట్టిన మండపం ఆకట్టుకుంటుంది. దశవతారాల సెట్ లోపల పడవపై గణనాథులు చూపరులను మంత్రముగ్ధుల్ని చేస్తున్నారు. గొల్లనారాయణపురంలో గణేశ్ యంగ్ గయ్స్ నిర్వాహకులు ప్రతిష్ఠించిన శివుని చేతిలో గణేశుడు, ప్రహ్లాదపురం సమీప శివానందనగర్‌లో మహిళలు ఏర్పాటు చేసిన వినాయకుడు, శ్రీనివాసనగర్ ఓల్డ్ సంత డౌన్‌లో పోలమాంబ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన శ్రీవారి రూపంలోని గణేశుడు ఆకట్టుకుంటున్నారు.



రాపాలమ్మ కాలనీలో సీతాదేవికి పాదపూజ చేస్తున్న గణేశుడు



యాతపాలెంలో గణపతి సన్నిధిలో నల్లూరి సూర్యనారాయణ, తదితరులు



69వ వార్డు వెంకటేశ్వర కాలనీలో పూజలందుకుంటున్న పంచముఖ విఘ్నేశ్వరుడు



కొండయ్యవలసలో గరుడ వాహనదారుడిగా కొలువుదీరిన పార్వతీపుత్రుడు



వేపగుంట శ్రీనివాసనగర్ ఓల్డ్ సంత డౌన్‌లో వేంకటేశ్వరస్వామి అవతారంలో గణనాథుడు



ఎల్లపువానిపాలెంలో హెలికాప్టర్ సెట్..పక్కన సైనికుడి రూపంలో డ్రైవింగ్ చేస్తున్న వినాయకుడు

ఆటో డ్రైవర్ల నిరసన ప్రదర్శన

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్

పెదగంట్యాడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆటో డ్రైవర్లు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీదుర్గాదేవి ఆటో స్టాండ్‌కు చెందిన డ్రైవర్లు నిర్వాసిత కాలనీలో ప్రదర్శన నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుతో నష్టపోతున్న తమకు ఆర్థిక భరోసా కల్పించాలని, ఆర్టీవో తనిఖీల పేరుతో అధికంగా జరిమానా విధించే విధానాన్ని విడనాడాలని, ఈఎస్ఐ, పీఎఫ్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఆర్టీవో ట్రాకింగ్ సిస్టమ్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగాలని, ఏటా ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఇస్తామన్న రూ.1 5వేలను తక్షణమే అమలు చేయాలని నినాదాలు చేశారు. పెదగంట్యాడ జంక్షన్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన దుర్గవానిపాలెం, సీతానగరం, నెల్లిముక్కు, బాలచెరువు, సీకువానిపాలెం, సిద్దేశ్వరం, దల్లివానిపాలెం, తదితర ప్రాంతాల మీదుగా ఫైర్ స్టేషన్ జంక్షన్ వరకు సాగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆటోలను నిలిపివేసి డ్రైవర్లు నిరసనలో పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామంటు దుర్గమాంబ ఆటో స్టాండ్ డ్రైవర్లు కూర్మన్నపాలెం, వడ్లపూడి, దువ్వాడ రోడ్డు, శ్రీనగర్, ఆటోనగర్‌లలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు కర్రి పైడిరాజు, డి.వెంకటరెడ్డిలు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని తాము వ్యతిరేకించడం లేదని, అయితే ఈ పథకం వల్ల తమ ఆటోలు ఎక్కే ప్రయాణికుల సంఖ్య తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారుతుందని, ఇంటి అద్దెలు, ఆటోలకు ఫైనాన్స్ ఎలా చెల్లించాలో అర్థం కావడం లేదని వాపోయారు. నాయకులు కొరుప్రోలు శ్రీనివాస్, నూక అప్పారావు, అప్పలనాయుడు, ఎర్రన్న, షేక్ అలీ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: అగనంపూడి, ఇ-మర్రిపాలెం, డొంకాడ కాలనీల్లో గల ఆటో స్టాండ్ల వద్ద డ్రైవర్లు శాంతియుతంగా నిరసన చేపట్టారు. శ్రమశక్తి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్త్రీశక్తి పథకం వల్ల తమకు ప్రయాణికుల తాకిడి తగ్గి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అందువల్ల తమను కూటమి ఆదుకోవాలని కోరారు. యూనియన్ ప్రతినిధులు గుర్రం శ్రీను, నక్కా గోవింద్, నందగోపాల్. చిన్నబాబు, రవికుమార్, సూర్యచంద్రరావు, చిన్నా, బొర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: జిల్లా వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు చేపట్టిన ఆందోళనలో భాగంగా షీలానగర్, బీహెచ్‌పీవీ, అక్కిరెడ్డిపాలెం ఆటో స్టాండ్ల వద్ద డ్రైవర్లు నిరసన ప్రదర్శన చేపట్టారు. స్త్రీశక్తి పథకం మూలంగా నష్టపోతున్న తమను ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.



అగనంపూడిలో నినాదాలు చేస్తున్న ఆటో డ్రైవర్లు



వడ్లపూడి ప్రధాన రహదారిపై..

గోతిలో కూరుకుపోయిన లారీ

కూర్మన్నపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి ప్రధాన రహదారిలో గురువారం అధిక లోడుతో వస్తున్న ఓ లారీ డివైడర్ పక్కన ఉన్న గోతిలో కూరుకుపోవడంతో ఈ మార్గంలో ఇతర వాహనాల రాకపోకలకు కాసేపు అంతరాయం వాటిల్లింది. క్రేన్ సాయంతో లారీని బయటకు తీసేందుకు కొద్దిసేపు శ్రమించాల్సి వచ్చింది. వర్షం కురిసినప్పుడల్లా ఈ రహదారిలో ఇలాంటి పరిస్థితి నెలకొంటుందని స్థానికులు వాపోతున్నారు. అందువల్ల అధికారులు స్పందించి గోతులమయమైన ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



ఇ-మర్రిపాలెం కూడలి వద్ద..

డివైడర్‌పైకి దూసుకుపోయిన వ్యాన్

అగనంపూడి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి ఇ-మర్రిపాలెం కూడలి వద్ద గురువారం ఓ వ్యాన్ అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకుపోయింది. అనకాపల్లి నుంచి గాజువాక వస్తున్న వ్యాన్ సరిగ్గా ఇ- మర్రిపాలెం జంక్షన్ వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలిలో పెను ప్రమాదం జరగపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు క్రేన్ సాయంతో డివైడర్ పైనుంచి వ్యాన్‌ను తొలగించారు. ఈ కారణంగా కాసేపు ట్రాఫిక్ స్తంభించింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అగనంపూడి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి, మంగళపాలెం 33/11 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా అగనంపూడి, డొంకాడ, బీసీ కాలనీ, కొండయ్యవలస, సాయినగర్, దానబోయినపాలెం, తలారివానిపాలెం, అండమాన్ కొండయ్యవలస, పెదమడక, పినమడక, ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి ఏరియా, శనివాడ, శాంతినగర్, గల్లవానిపాలెం, జాబిలి హిల్స్, పాతఅగనంపూడి, దువ్వాడ, మంగళపాలెం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, వెదుళ్లనరవ, గంగవరం, శెట్టిపాలెం, లంకివానిపాలెం, అజనగిరి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

ములగాడ తహశీల్దార్‌కు అదనపు బాధ్యతలు

మల్కాపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ములగాడ తహశీల్దార్ రమేశ్‌నాయుడుకి పెదగంట్యాడ మండల ఇన్‌చార్జి తహశీల్దార్‌గా అదనపు బాధ్యతలను జిల్లా కలెక్టర్ అప్పగించారు. ఈ మేరకు ఆయన ఈ రెండు మండలాల్లోనూ సేవలందిస్తారు.

దేవుడి పేరిట వసూళ్లకు పాల్పడే వారిపై చర్యలు చేపట్టాలి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



..మాట్లాడుతున్న పల్లా

గాజువాక, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భక్తి పేరిట భారీ గణనాథుని విగ్రహాలను ప్రతిష్ఠించి క్యూ లైన్లు, పార్కింగ్, షాపులు, అన్నదానం పేరిట ప్రజల ఉంచి నగదు వసూలు చేయడం భావ్యం కాదని, అటువంటి వారిపై అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవుడి సేవ పేరుతో వ్యాపారాలు చేసి ప్రయోజనం పొందాలనుకోవడం గౌరవప్రదమైన చర్య కాదన్నారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ బొండా జగన్,నాయకులు పులి వెంకటరమణారెడ్డి, పెంటి రాజు, రామారావు, అప్పలరాజు, అఫీజా, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా వినయ్‌కుమార్

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా సెయిల్ సంస్థకు చెందిన జనరల్ మేనేజర్ వినయ్‌కుమార్ పేరును ఉక్కు మంత్రిత్వశాఖ ఎస్‌సీఎస్‌సీ (సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీ) సిఫారసు చేసింది. ఢిల్లీలో బుధవారం జరిగిన ఇంటర్వ్యూకు స్టీల్ ప్లాంటుకు చెందిన నలుగురు అధికారులు, సెయిల్ నుంచి ఏడుగురు, ఎన్ఎల్‌సీ నుంచి ఒకరు, ఎన్ఎండీసీ నుంచి ఒకరు హాజరయ్యారు. వీరిలో సెయిల్‌లో జనరల్ మేనేజర్ (ఫైనాన్స్)గా విధులు నిర్వహిస్తున్న వినయ్‌కుమార్ పేరును కమిటీ సిఫారసు చేసింది.

1న ఎన్ఏడీలో స్త్రీశక్తి విజయోత్సవ సభ

గోపాలపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లోని సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన స్త్రీశక్తి పథకం విజయవంతంగా అమలు జరగుతున్న నేపథ్యంలో సెప్టెంబరు 1న ఎన్ఏడీ జంక్షన్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. గురువారం తమ నివాసంలో జరిగిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకటో తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే బహిరంగ సభకు కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జనావాసాలలోకి కనుజు: దాడి చేసిన కుక్కలు


గోపాలపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సింహాచలం అటవీ ప్రాంతం నుంచి దారితప్పి గోపాలపట్నం కొండవాలు ప్రాంతంలోకి జనావాసాల్లోకి ఓ కనుజు గురువారం సాయంత్రం వచ్చింది. గణేశ్‌నగర్ పరిసరాల్లోని సంచరిస్తున్న కనుజుపై కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు కుక్కల బారినుంచి దానిని రక్షించి సమీపంలోని టింబర్ డిపోలో ఉంచారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారి వచ్చి కనుజును పరిశీలించి, ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం కనుజును జూ పార్కును తరలిస్తున్నట్టు తెలిపారు.

కొలువుదీరిన గణనాథులు





పూర్ణామార్కెట్ వద్ద పూరీ జగన్నాథస్వామి అవతారంలో గణనాథుడు


జడ్జికోర్టు ఎదురుగా కొబ్బరికాయలతో వినాయకుడు


క్రికెటర్‌గా గణనాథుడు


సంపత్ వినాయక ఆలయంలో బాల గణపతి


జాలారిపేట వద్ద జాతీయ నాయకుల రూపంలో


హిమాలయాల సెట్‌లో విఘ్నేశ్వరుడు


గాజువాక సింహగిరి కాలనీలో నెమలి పింఛాలతో


జాలారిపేట వద్ద బోరింగు కొడుతూ...

2 నుంచి అప్పన్న ఆలయంలో పవిత్రోత్సవాలు

సింహాచలం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అప్పన్న ఆలయంలో వచ్చే నెల 2న పవిత్రోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నట్టు ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. 2న సాయంత్రం 6 గంటల తరువాత విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విక్వరణం, ఉత్సవాంగీకారం, మృత్సంగ్రహణం, అంకురార్పణతో కార్యక్రమాలు ప్రారంభమై 6న ఏకాంత స్నపనం, తిరుమంజనం, తిరువీధి నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సెప్టెంబరు 2 నుంచి 6 వరకు దేవాలయంలో ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆయా రోజుల్లో రాత్రి 7గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామి దర్శనాలు లభిస్తాయన్నారు.

కూలిన పోలీస్ బ్యారెక్స్ ప్రహరీ


ప్రహరీ శిథిలాలను తొలగిస్తున్న సిబ్బంది

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా పోలీస్ బ్యారెక్స్ ప్రహరీ కూలిపోయింది. 35వ వార్డు కల్లుపాకలు వద్ద బుధవారం అర్ధ రాత్రి దాటిన తర్వాత జరిగిన ఈ ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్పపీడన ప్రభావంతో నగరంలో విస్తారంగా వరాలు కురిశాయి. వినాయక చవితి నేపథ్యంలో కల్లుపాకలు వద్ద బ్యారక్స్ ప్రహరీని ఆనుకుని ఏర్పాటు చేసిన వినాయక మండపం తాళ్లను ప్రహరీకి దన్నుగా కట్టారు. వర్షాల కారణంగా గోడ నానిపోవడంతో అర్ధరాత్రి దాటిన తర్వాత కూలిపోయింది. ఆ సమయంలో మండపంలో ఆరుగురు యువకులు నిద్రిస్తున్నారు. ఇద్దరిపై శిథిలాలు పడడంతో స్వల్పగాయాలయ్యాయి. డయల్ 100కు సమాచారం అందించడంతో టూటౌన్ సీఐ ఎర్రంనాయుడు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని కేజీహెచ్‌కు తరలించారు. ఘటనలో మండపానికి ఎలాంటి నష్టం వాటిల్లలేదు. పోలీసులు, జీవీఎంసీ అధికారులు వాహనాలతో డెబ్రిస్‌ను తరలించారు.

నేడు క్రీడాకారులకు సత్కారం


మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు

విశాఖపట్నం, స్పోర్ట్స్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినం సందర్భంగా ఏటా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తారన్నారు. ఏయూ కన్వెన్షన్ హాల్లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రం నుంచి జాతీయ, అంతరాజాతీయ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతోపాటు ఒలింపియన్స్ ఎర్రాజీ జ్యోతి, జ్యోతి సురేఖ, అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు 480 మంది క్రీడాకారులను సత్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, క్రీడల మంత్రి రాంప్రసాదరెడ్డి, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ హాజరవుతారని తెలిపారు. అనంతరం ఏర్పాట్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య ఎన్.విజయ్‌మోహన్, శాప్ ఏవో వెంకటరమణ, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సేనతో సేనాని


సమావేశంలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్


సమావేశానికి హాజరైన జనసేన పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు



జనసేన విస్తృతస్థాయి సమావేశాలకు హాజరైన నాయకులతో ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్


పార్టీ కార్యాలయంలో మహిళల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

మంత్రి లోకేశ్‌కు సాదర స్వాగతం

నగరంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మానవవనరులు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌కు విమానాశ్రయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, తెలుగుదేశం పార్టీ నాయకులు గురువారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలపై మంత్రికి అర్జీలు ఇచ్చారు. అనంతరం మంత్రి పార్టీ కార్యాలయానికి చేరుకుని అర్జీలు స్వీకరించారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

కిరండూల్ రైళ్లు రద్దు, గమ్యం కుదింపు

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా కిరండూల్ సెక్షన్‌లో నీరు నిలిచిపోయి, బండరాళ్లు పడిన నేపథ్యంలో విశాఖ-కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్‌ను (18515) ఈనెల 29, 31న... కిరండూల్-విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్‌ను (18516) ఈనెల 30న రద్దుచేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (18515) రైలు ఈనెల 30, వచ్చే నెల 1న విశాఖ నుంచి జగదల్‌పూర్ వరకు, కిరండూల్-విశాఖ (18516) ఈనెల 29, 30, వచ్చే నెల 2న జగదల్‌పూర్ నుంచి విశాఖ చేరుతుంది. విశాఖ-కిరండూల్ మధ్య నడిచే పాసింజర్ రైళ్లు (58501, 58502) ఈనెల 30, 31, సెప్టెంబరు 1న విశాఖ-కోరాపుట్ మధ్య రాకపోకలు సాగిస్తాయి.

సమస్యలు పరిష్కరించండి: సీఎస్

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల్లో ప్రజాసమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ చెరువులు, భూగర్భజలాల నిర్వహణ, భూ సమస్యలు, పింఛన్ల పంపిణీ విధానం, ఏజెంట్ స్పేస్ కోసం డాక్యుమెంట్లు అప్‌లోడ్, యూరియా లభ్యత, ధరల నిర్ణయం, జిల్లాలో జువైనల్ జస్టిస్ కమిటీల ఏర్పాటు, భారత వైమానిక దళానికి చెందిన సమస్యలపై దృష్టిసారించాలన్నారు. కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ పాల్గొన్నారు.

భీమిలిలో మహిళా సెజ్ ఏర్పాటు: ఎమ్మెల్యే గంటా


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా

మధురవాడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక సాధికారిత కోసం భీమిలిలో ప్రత్యేక మహిళా ఎకనామిక్ జోన్ (ఎస్ఈజడ్) ఏర్పాటు చేయనున్నట్టు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. మధురవాడ వి కన్వెన్షన్ హాల్లో గురువారం సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ స్త్రీశక్తి పథకంపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆస్తిలో సమానహక్కు, మహిళా రిజర్వేషన్ వంటి విప్లవాత్మక సంస్కరణలతో ప్రారంభమైన టీడీపీ పథకాలు కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వానికి మహిళలు అండగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ఊహించినదానికంటే విజయవంతమయిందన్నారు. మాజీ సీఎం జగన్‌కు మహిళలంటే గౌరవం లేదని, ఆస్తికోసం తల్లి, చెల్లిని కోర్టుకు ఈడ్చారన్నారు. విశాఖ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. మంత్రి లోకేశ్ చొరవతో టీసీఎస్, అదానీ డేటా సెంటర్, కాగ్నిజెంట్, గూగుల్, సత్వా, సిఫీ వంటి సంస్థలు నగరానికి వస్తున్నాయన్నారు. వచ్చే ఏడాదికి భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వచ్చే సరికి 15 కనెక్టవిటీ రోడ్లు, పది ఫ్లైఓవర్లు పూర్తిచేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 80 శాతం ఎన్నికల హామీలను నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకం అందడంతో తొలిఅడుగు పేరుతో ధైర్యంగా ఇంటింటికీ వెళ్లగలుగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ వన్ జడ్పీ కనకమహాలక్ష్మి, ఆనందపురం ఎంపీడీఓ జానకి, కార్పొరేటర్లు పిళ్లా మంగమ్మ, మొల్లి హేమలత, గాడు చిన్నికుమారి లక్ష్మి, మహిళా నేతలు లీలావతి, రమాదేవి, లక్ష్మి, మంగాదేవి, నందిని తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ ఎంఎస్‌వోపై వైద్యురాలి ఫిర్యాదు

మహారాణిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ థియేటర్‌లో తనను తాకకూడని భాగంలో ఓ వైద్యుడు తాకాడని అనస్థీషియా సీనియర్ రెసిడెంట్ వైద్యురాలు ఆస్పత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం సర్జికల్ థియేటర్‌లో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది రోగికి వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ సమయంలో థియేటర్‌లో విధుల్లో ఉన్న ఎంఎస్‌వో శంకరరావు తనను వెనుక భాగంలో తాకాడని సీనియర్ రెసిడెంట్ వైద్యురాలు సూపరింటెండెంట్, ఏఎంసీ ప్రిన్సిపాల్‌కు వన్‌టౌన్ పోలీసుకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై వారిని వివరణ కోరగా థియేటర్ చిన్నదిగా ఉండడంతో వైద్య పరికరాలు అందించే సమయంలో ఆమెకు చేతులు తగిలిన విషయం గమనించలేదని వైద్యుడు ప్రాథమిక విచారణలో తెలిపారన్నారు. ఆ సమయంలో థియేటర్‌లో సుమారు ఎనిమిదిమందిపైగా ఉన్నారని, విచారణ కమిటీని నియమించి దర్యాప్తు చేస్తామన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామిని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చనా మజుందార్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి గురువారం దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న తరువాత అంతరాలయంలో పూజలు చేయగా గోదాదేవి దర్శనం అనంతరం వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.